quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే
QUICK TODAY DAILY దినపత్రిక

విలేకరులు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం.
తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.

వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476 క్విక్ టుడే తెలుగు దినపత్రిక

EDITOR : GILLALA BUCHI REDDY | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 243 | ఆదివారం, మే 26 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

## ఆరో విడతలో చెదురుమదురు ఘటనలు

- 57.70 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ వెల్లడి



**న్యూఢిల్లీ,(క్విక్ టుడే) :**లోక్‌సభ ఎన్నికల పక్రియలో భాగంగా శనివారం ఉదయం మందకొడిగా మొదలైన 6వ విడత పోలింగ్ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకూ 57.70 శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ తెలిపింది. పశ్చిమబెంగాల్లో అత్యధికంగా 77.99 శాతం పోలింగ్ నమోదు కాగా, జమ్మూకశ్మీర్ లో అత్యల్పంగా 51.35 శాతం నమోదైంది. ఢిల్లీలో 53.73 శాతం, బీహార్‌లో 52.24, జార్ఖాండ్‌లో 61.41, ఉత్తరప్రదేశ్‌లో 52.02, ఒడిశాలో 59.60, హర్యానాలో 55.93 శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ డాటా తెలిపింది. ఢిల్లీలోని మొత్తం 7 లోక్‌సభ నియోజకవర్గాలు, హర్యానాలోని 10, బీహార్‌లో 8, పశ్చిమబెంగాల్‌లో 8, ఒడిశాలో 6, జార్ఖాండ్‌లో 4, ఉత్తరప్రదేశ్‌లోని 14 లోక్‌సభ స్థానాలకు శనివారం పోలింగ్ జరిగింది. జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్-రాజౌరిలోనూ ఈరోజు పోలింగ్ ముగిసింది.

ఆరో విడత పోలింగ్ ముగియడంతో ఇంకా మిగిలిన 57 లోక్‌సభ స్థానాలకు ఏడో విడత ఎన్నికల్లో భాగంగా జూన్ 1న పోలింగ్ జరుగుతుంది. దీంతో ఎన్నికలు పూర్తవుతాయి. జూన్ 4న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

# డ్రగ్స్ అన్న మాట వినరావద్దు

- కఠిన చర్యలు తీసుకోవాల్సిందే - వర్షాకాలంలో ముందస్తు చర్యలకు సిద్ధం కావాలి
- కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించిన సిఎం రేవంత్
- డిజిపి, సిఎస్‌లతో పలు అంశాలపై సమీక్ష



**హైదరాబాద్,(క్విక్ టుడే) :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా చేయాలని భావించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌కు సీఎం హోదాలో తొలిసారి రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లారు. కమాండ్ కంట్రోల్‌లో ఉండే అధికారులు విధులు, ఇతర అంశాలపై సమీక్షిస్తుంచినట్లు తెలుస్తోంది. నార్కోటిక్స్ బ్యూరో పనితీరుపై ఆరా తీసిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణలో డ్రగ్స్ అనే పదం వినిపించకూడదు అని ఆదేశించారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే యువతపై డ్రగ్స్, మత్తు పదార్థాలు తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. నార్కోటిక్స్ బ్యూరోకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకబడ్జెట్ కేటాయించింది. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాలని ఉన్నతాధికారులను

మిగతా 2లో...

## చైనా ఆక్రమణలపై నోరు మెదపరేం

హిమాచల్ ఎన్నికల ప్రచారంలో ఖర్గే విమర్శలు



**సిమ్లా,(క్విక్ టుడే) :** భారత్‌లోని భూభాగాలను చైనా ఆక్రమించడాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. ఆ దేశం మన ప్రాంతాలను ఆక్రమించినా.. ప్రధాని ఇంకా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం హిమాచల్ ప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొన్న ఖర్గే.. మోదీపై విమర్శలు గుప్పించారు. నాటి భారత ప్రభుత్వం పాకిస్థాన్‌తో పోరాడి బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టింది. భారత్ భూభాగాలను చైనా ఆక్రమించింది. ఇక్కడ రోడ్లు, ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. అయినా.. ప్రధాని నరేంద్ర మోదీ మౌనంగా ఉన్నారు. ఇప్పుడు మీ 56 అంగుళాల ఛాతీ ఎక్కడ ఉందని ఖర్గే ప్రశ్నించారు. 2023లో హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వరదలు వచ్చిన సందర్భాన్ని గుర్తు చేస్తూ.. మోదీ సర్కార్‌పై ఖర్గే విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. వరదలతో హిమాచల్ అతలాకుతలమైంది. నాడు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్ల సాయం కోరినా కేంద్రం స్పందించకపోవడం బాధాకరం.

రాజ్యాంగం, దేశ ప్రజలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా శ్రమిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే ప్రభుత్వంలో ఉన్న 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తాం అని హామీ ఇచ్చారు.

## తెలంగాణలో మళ్లీ పెరిగిన ఎండలు

- ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకుపైగా నమోదు
- వర్షాలు తగ్గుముఖంతో మారిన వాతావరణం



**హైదరాబాద్,(క్విక్ టుడే) :** తెలంగాణలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు..ఎండలు దంచి కొడుతు న్నాయి. మళ్లీ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకుపైగా నమోదవుతు న్నాయి. ఈ క్రమంలో రాబోయే ఐదురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శనివారం ఉరు ములు, మెరుపులు, ఈదురుగాలు లతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి,

మిగతా 2లో...

## ఓటమికి ఖర్గేను బలిపశువును చేస్తారు

- తరవాత ఇవిఎంలు ట్యాంపర్ అంటూ ఏడుస్తారు
- ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, విపక్షాలపై మోడీ విమర్శలు

**పట్నా,(క్విక్ టుడే) :**లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి ఓటమి ఖాయమని.. దీనికి మల్లికార్జున ఖర్గే ను కాంగ్రెస్ బలిపశువును చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఓటమి అనంతరం ఆ పార్టీ 'రాచకుటుంబం' విదేశీ పర్యటనలకు వెళ్లిపోతుందని తెలిపారు. ఎన్నికలు ముగియడానికి ముందే ప్రతిపక్ష కూటమి తన ఎగ్జిట్ పోల్స్‌తో ముందుకువచ్చింది. త్వరలో వారు ఈవీఎంలపై పడి ఏడుస్తారని ఎద్దేవా చేశారు. బిహార్‌లోని కారాకాట్, పాటలీపుత్రల్లో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో మోదీ పాల్గొని, ప్రసంగించారు. 'ఇండియా' కూటమి తన దాస్యాన్ని చాటుతూ.. ఓటు బ్యాంకును ప్రసన్నం చేసుకునేందుకు వారిముందు ముజ్రా నృత్యం చేస్తోందని ఆరోపించారు. ఆర్జేడీ పాలనలో రాష్ట్రంలో అపహరణలు, హత్యలు సర్వసాధారణమే. కొన్ని రాష్ట్రాల సీఎంలు బిహారీలను దుర్భాషలాడుతుంటే ఆర్జేడీ మాత్రం నోరు మెదపదు. వారి ఆత్మగౌరవాన్నీ పట్టించుకోదు. ప్రస్తుత ఎల్ఈడీ బల్బుల యుగంలోనూ లాంతరుతో తిరుగుతూ.. రాష్ట్రం మొత్తాన్ని చీకట్లో ఉంచి, కేవలం తన ఇంటిని మాత్రమే వెలిగిస్తోందని లాలూ గుర్తును పోలుస్తూ ఎద్దేవా చేశారు.

మిగతా 2లో...



## పదేళ్లలో 1,60,083 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

- ఉమ్మడి ఎపితో పోలిస్తే తెలంగాణలోనే టాప్
- పూర్తిగా స్థానికులకే ఉద్యోగావకాశాలు - ఉపాధి కల్పన రంగంలో ముందున్న తెలంగాణ
- మీడియా సమావేశంలో కెటిఆర్ వివరణ

**హైదరాబాద్,(క్విక్ టుడే) :** కేసీఆర్ హయాంలో 1,60, 083 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేశామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ హయాంలో ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగానికి కూడా కొత్తగా నోటిఫికేషన్ రాలేదని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో భర్తీ చేసిన ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాకు వెల్లడించారు. తెలంగాణ ఏర్పడి ఒక దశాబ్ద కాలం అవుతోంది. ఉపాధి కల్పన రంగంలో తెలంగాణ అనేక విజయాలు సాధించింది. గత పదేండ్లలో ఇప్పటి దాకా కూడా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఉపాధి కల్పన తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా జరిగింది లేదు. ఈ దశాబ్ద కాలంలో జరిగిన ఉపాధి కల్పన

మిగతా 2లో...



## ధరలు.. నిరుద్యోగమే అసలు సమస్య

- వీటిపై బిజెపి నేతలు ఎందుకు మాట్లాడరు
-కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక సూటిప్రశ్న

**న్యూఢిల్లీ,(క్విక్ టుడే) :** దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం పెద్ద సమస్యలుగా ఉన్నాయని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ అన్నారు. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ గెలుస్తుందని అన్నారు. పరిస్థితులు ఇండియా కూటమికి అనుకూలంగా ఉన్నాయన్నారు. శనివారం ఉదయం ప్రియాంక గాంధీ కుటుంబ సభ్యులతో కలసి తన ఓటును వినియోగించుకున్నప్పుడు ఈ



మిగతా 2లో...

(మొదటి పేజీ తరువాయి)

# పదేళ్లలో 1,60,083



గురించి తెలంగాణ యువతకు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. నీళ్లు, నిధులు నియమకాలు ప్రతిపాదికన తెలంగాణ ఉద్యమం జరిగింది. కేసీఆర్ నాయకత్వంలో సాధించిన ప్రగతి, ఉపాధి కల్పన రంగంలో సాధించిన విజయాలను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యధేచ్ఛగా తెలంగాణకు రావాల్సిన ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో తీవ్రమైన వివక్ష, అన్యాయం జరిగింది. దాన్ని నిరసిస్తూ ఎన్నో సందర్భాల్లో కేసీఆర్ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారు. హైదరాబాద్‌ను ఫ్రీ జోన్‌గా ప్రకటించడాన్ని నిరసిస్తూ కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఉమ్మడి ఏపీలో రాష్ట్రపతి ఉత్తర్వులను యధేచ్ఛగా, ఇష్టానుసారంగా నాటి ప్రభుత్వాలు తుంగలో తొక్కాయి. ఉత్తర్వులను ఉల్లంఘించాయి. జోనల్ సిస్టమ్‌లో ఉన్న ఓపెన్ కోటాను నాన్ లోకల్ కోటాగా అన్వయిస్తూ.. సమైక్య పాలకులు తెలంగాణ యువతకు తీవ్ర అన్యాయం చేశారు అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకత్వాన్ని సవాల్ చేస్తున్నాను. అటెండర్ నుంచి గ్రూప్ 1 ఆఫీసర్ దాకా 95 శాతం ఉద్యోగాలు స్థానిక పిల్లలకే ఇచ్చే రాష్ట్రం తెలంగాణ తప్ప మరొకటి ఉన్నదా..? ఒకవేళ ఉంటే తెలంగాణ యువతకు చెప్పాలని బీజేపీ, కాంగ్రెస్ నాయకత్వాన్ని సవాల్ చేస్తున్నా. ఈ రెండు పార్టీలే 75 ఏండ్లు అధికారంలో ఉన్నాయి. 28రాష్ట్రాల్లో ఆయా పార్టీల ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయి.

# ధరలు.. నిరుద్యోగమే



విషయాలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఆమ్ ఆద్మీ పార్టీకి, అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ వారు కాంగ్రెస్ కు ఓటేయడంపై మాట్లాడుతూ మా మధ్య భేదాలను మేము పక్కన పెట్టే శాం. రాజ్యాంగాన్ని, ప్రజాస్వా మ్యాన్ని రక్షించేందుకు ఒకొరికొకరం సహకరి స్తూ ఓటేకుంటున్నాం. అందుకు నేను గర్విస్తున్నాను అన్నారు. బిజెపి నాయ ుకులు ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్య తప్ప అన్ని విషయాలపై మాట్లా డుతున్నారు.

# తెలంగాణలో



ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది. గడిచిన 24గంటల్లో వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది.

# ఓటమికి ఖర్గేను



భూములు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చినవారు జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందే. అవినీతిప రులంతా కటకటాల వెనక్కి వెళ్లాల్సిందే అని ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబాన్ని ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఎస్సీలు, వెనకబడిన తరగతుల రిజర్వేషన్లను కాజేసేందుకు 'ఇండియా' కూటమి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటా నని మోదీ తెలిపారు. శక్తిమంతమైన భారత్‌కు ప్రపంచవేదికపై సరైన న్యాయం చేయగల ప్రధాని అవసరం. కానీ, ఈ పదవి విషయంలో విపక్ష కూటమి.. కుర్చీలాట ఆడాలనే ఉద్దేశంతో ఉంది. కాంగ్రెస్, ఆర్జేడీ, ఎన్‌సీపీ, సమాజ్‌వాదీ తదితర కుటుంబ పార్టీలకు చెందినవారు ప్రధానిగా కొద్దికాలం పాటు కొనసాగాలని చూస్తున్నారని విమర్శించారు.

# డ్రగ్స్ అన్న మాట

సీఎం రేవంత్ రెడ్డి ఇదివరకే ఆదేశించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు అరికట్టడంతో పాటు అవి ఎక్కడి నుంచి వస్తున్నాయో గుర్తించి చర్యలు తీసుకోవడంపై చర్చించారు. ఇటీవల బెంగళూరు శివారులో జరిగిన రేవ్ పార్టీ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపింది. టాలీవుడ్ సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు ఆ పార్టీలో డ్రగ్స్ వినియోగించారని బెంగళూరు పోలీసులు ప్రకటించడంతో ఈ సమీక్షపై ఉత్కంఠ నెలకొంది. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను శనివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి



కమాండ్ కంట్రోల్‌కు వచ్చిన ఆయనకు సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం అక్కడి సెక్యూరిటీ వింగ్, డ్రగ్స్ కంట్రోల్ వింగ్‌లను సీఎం పరిశీలించారు. అధికారుల విధుల గురించి తెలుసుకుని, వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నార్కోటిక్స్ బ్యూరోకు బడ్జెట్ కేటాయించిన నేపథ్యంలో దానిపై చర్చించారు. డ్రగ్స్ నిర్మూలనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్లోనే ఇతర విభాగాల అధికారులతోనూ సీఎం సమీక్ష చేపట్టారు. రాబోయే వర్షాకాలానికి సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై చర్చించారు. పోలీస్, ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, వాతావరణశాఖతో పాటు ఇతర విభాగాల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.
















# 4 గంటల వరకే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అల



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో మే 25(క్విక్ టుడే):** వరంగల్ ఖమ్మం నల్గొండ శాసనమండలి ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈనెల 27న ఉదయం 8 గంనుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అల ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ఖమ్మం నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్ కు నియోజకవర్గంలో ఓటు హక్కు ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ నెల 27న శాసనమండలి ఉపఎన్నికకు జరిగే పోలింగ్ లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు గాను స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఇదే నియోజకవర్గ పరిధిలో ఓటరుగా ఉండి ప్రైవేటు యాజమాన్యాలు వాణిజ్య సంస్థలు పారిశ్రామిక సంస్థలలో పనిచేసే ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు ఆరోజు వారి ఉద్యోగులకు విధులకు ఆలస్యంగా వచ్చేందుకు అనుమతి ఇవ్వటం కానీ లేదా వారు పని చేసే షిఫ్ట్ లను సవరించడం లేదా పనివేళల్లో వెసులు బాటు కల్పించడం ద్వారా ఓటు హక్కువినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు. ఓటర్లందరూ వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాలు వ్యాపార వాణిజ్య సంస్థలు పారిశ్రమక సంస్థలు వారి ఉద్యోగులకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించండి

### తీన్మార్ టీం సభ్యులు విస్తృత ప్రచారం



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో మే 25(క్విక్ టుడే):** కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపిం చాలని తీన్మార్ మల్లన్న టీం సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం టీం సభ్యులు ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృత ప్రచారం నిర్వహించడంతోపాటు ఉద్యోగులను కలిసి మల్లన్నకు ఓటు



వేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న కొత్తగూడెం టీం సభ్యులు తాటిపల్లి శ్రావణ్ కొత్తగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ మెంబర్ రియాజ్ భాయ్ అజయ్ చారి రాజ గౌడ్ ఆనంద్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూన్ 4న బయటపడనున్న అభ్యర్థుల భవితవ్యం

### - పకడ్బందీగా లెక్కింపు ప్రక్రియ



**పినపాక మే 26, క్విక్ టు డే న్యూస్ :** అందరి అంచనాలు, ఊహలు తారుమారయ్యే పరిస్థితులు కనిపించబోతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిన్నటిదాకా మాది అంటే మాది అధికారం అన్న నేతల నోళ్లు జూన్ 4న దగ్గర పడనున్నాయి. ఈసారి చాలావరకు ఓటర్లు స్వచ్ఛందగా ఓటర్లుస్వచ్ఛందంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు సమాచారం. ఇదిలావుంటే ప్రతీ ఎన్నికల్లో అభ్యర్థులు కొందరు పెద్దమొత్తంలో డబ్బులు పంపిణీ చేసేవారు. అయితే ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో అలా జరగలేదు. కానీ కొన్ని ప్రాంతాల్లో అభ్యర్థులు కొందరు ఓటుకు ఇంత అని ఒక్కో ఓటరుకు రెండు నుంచి మూడు వందల లోపు పంపకాలు జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే చాలా వరకూ ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కు ను వినియోగించుకోవడం గమనార్హం. లెక్కింపు కార్యక్రమం దగ్గర పడుతుండటంతో స్ట్రాంగ్ రూమ్ ల దగ్గరేగాకుండా పరిసర ప్రాంతాల్లో కూడా పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.. శాంతిభద్రతలకు ఏ మాత్రం విఘాతం కలగనీయకుండా మఫ్టీ పోలీసులు, నిఘా పోలీసుల సంచారం పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ ఓట్ల లెక్కింపు ప్రక్రియను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ సవాల్ గా తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ విషయంలో ఎటువంటి సమస్య తలెత్తినా అందుకు సంబంధించిన ఎంతటి వారిని కూడా ఉపేక్షించేది లేదని సీపీ అంబర్ కిషోర్ ఝూ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా సాగే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఏ పార్టీకి ఎంత వరకు కలిసొస్తుందనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా అభ్యర్థుల భవితవ్యం జూన్ 4 తో బయటపడనుంది.

# త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేయాలి

### కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్



**చెన్నూర్, మే 25.క్విక్ టుడే న్యూస్ :** చెన్నూరు మండలం అస్నాద్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పెద్దపల్లి పార్లమెంట్ బిజెపి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు.వర్షం కురవడం వలన ధాన్యం మొత్తం మొలకెత్తి రైతులకు నష్టం జరుగుతుందని, ప్రభుత్వం వెంటనే లారీల సంఖ్య ను పెంచాలని డిమాండ్ చేశారు.వరి ధాన్యం కొనుగోలు లో అవకతవకలు జరుగుతున్నయి అని, తాలు, తేమ పేరుతో కోతలు పెడుతున్నారని, మిల్లర్లు చేస్తున్న దోపిడిని ప్రభుత్వం అరికట్టాలి అని అన్నారు.పార్లమెంట్ ఎన్నికల ముందు వరికి బోనస్ గా 500 రూ.లు ఇస్తాం అనిచెప్పి ఎన్నికల తర్వాత సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తాం అని చెప్పటం రైతులను మోసంచేయటం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకన్న గౌడ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, చెన్నూరు మండల అధ్యక్షుడు మోర్ల శంకర్, కోటపల్లి మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, చెన్నూరు పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తుల సమ్మయ్య, బీజేపీ నాయకులు రాజా నర్సయ్య, భీమారం మండల ఇన్చార్జి అలం బాపు, పెద్దింటి పున్నం,నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ఎస్పూరి రాజమల్లు, భీమ్ సైనిక దళ్ రాష్ట్ర అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి,వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం ఎల్లయ్య,యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల మదన్ మోహన్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పొట్టల నాగరాజు, జైపూర్ మండల యూత్ అధ్యక్షుడు సెగ్గం సంతోష్,అస్నాద గ్రామ అధ్యక్షుడు సత్తన్న మరియు గ్రామ బీజేపీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# యువతకు క్రికెట్ టీషర్ట్స్ పంపిణీ



**చెన్నూర్, మే 25. క్విక్ టుడే న్యూస్ :** భీమారం మండలం కాజిపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకంవృత్తి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అశోక్ యాదవ్ పెళ్లిరోజు సందర్భంగా కాజిపల్లె క్రికెట్ టీంకి భీమారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథి విచ్చేసిన భీమారం మండల ఎస్సై రాములు వారి చేతుల మీదుగా క్రికెట్ జెర్సీ టీషర్టు క్రీడాకారులు అందచేశారు.ఈ సందర్భంగా భీమరం మండల ఎస్సై రాములు మాట్లాడుతూ యువత భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని మద్యం మత్తు పదార్థాలకు బానిస కావద్దని బాగా చదువుకొని మంచి ఉన్నత స్థాయిలో వెళ్లాలని మంచి జాబ్స్ తెచ్చుకోవాలని క్రీడారంగంలో ముందుండాలని యువతను కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భూమన్న హెడ్ కానిస్టేబుల్ మాచర్ల రైటర్ పున్నం కానిస్టేబుల్ కిరణ్ కుమార్ హెూం గార్డ్ లక్ష్మన్న కాజిపల్లి క్రికెట్ టీం దయ్యాల కుమారస్వామి బీరేష్ దార వేణి రాకేష్ రాస రవితేజ దయ్యాల రాకేష్ అవరగాని ఉమేష్ యాదవ్ బోయిని శ్రీనివాస్ యాదవ్ చెవ్వ శివ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎరినాగుల ఓదెలును పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు



**చెన్నూర్, మే 25. క్విక్ టుడే న్యూస్:** రెండు రోజుల క్రితం వడ దెబ్బ తాకి అనారోగ్యం తో ఉన్న బిఆర్ఎస్ కోటపల్లి మండల్ అధ్యక్షులు ఎరినాగుల ఓదెలు ను పరమర్శించి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న చెన్నూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్, పాక్స్ చైర్మన్ సాంబ గౌడ్ కోటపల్లి మండల్ సోషల్ మీడియా అధ్యక్షులు ఆసంపెల్లి సంపత్ కుమార్, బిఆర్ఎస్ నాయకులు కొరళ్ళ సందీప్ రెడ్డి, ఆసంపెల్లి బాపు, అంకయ్య, సోషల్ మీడియా నాయకులు తూం యోగనంద్,చాకినారపు అజయ్, హరీష్ పొన్నం, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలి

### పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి





**పీర్జాదిగూడ, క్విక్ టుడే న్యూస్ :** ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకి మద్దతుగా తుంగతుర్తి నియోజకవర్గం అడ్డగూడూర్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల లో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామ శాఖ అధ్యక్షుల సమక్షంలో అడ్డగూడూర్ మండల అధ్యక్షులు లింగయ్యతో కలిసి తన ప్రచారాన్ని కొనసాగించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీ తో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమం లో సురేందర్ రెడ్డి, రమేష్, నగేష్, మజర్, నాగరాజు, వంగూరి పరమేష్, సోమయ్య, రంగన్న గౌడ్, శ్రీకాంత్, పఠాన్, మహేష్, నరేష్, సాయి రెడ్డి, రాజు, ప్రేమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి

### పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

**నల్లగొండ జిల్లా ప్రతినిధి. మే 25. (క్విక్ టుడే ) :** .నల్లగొండ జిల్లాలోని బహదూర్ ఖాన్ కాన్ఫరెన్స్ హాల్లో మహాత్మ జ్యోతి పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయ సంస్థలు పనిచేస్తున్న గెస్ట్ ఉపాధ్యాయులు మరియు అధ్యాపకులు రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎం జె పి టి బి సి డబ్ల్యూ ఆర్ ఐ ఎస్ – జస్ట్ టీచర్ మరియు లెక్చరర్స్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కొరకు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం గెస్ట్ టీచర్స్ అండ్ లెక్చలర్లు మాట్లాడుతూ ఫ్యాకల్టీ కొరకు కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని వివరించారు.. ఎటువంటి నిబంధనలు లేకుండా గెస్ట్ టీచర్స్ ను రెన్యువల్ చేసే విధంగా కోతలేని జీతాలు, ముఖ్యంగా దసరా సెలవులకు 15 రోజుల వేతనం కోత లేకుండా, ప్రతి నెలలో ఒక లీవ్ కంటే ఎక్కువ లీవ్ తీసుకుంటే జీతాలలో కోతలు లేకుండా ఇచ్చే విధంగా, పురుష అభ్యర్థులకు సంవత్సరానికి 24 క్యాజువల్ లీవ్స్,మహిళా అభ్యర్థులకు



సంవత్సరానికి 28 రోజులు క్యాజువల్లి స్త్రీలకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని ఉద్యోగ భద్రత కల్పి రెగ్యులరైజర్ చేయాలని సభాముఖంగా తెలిపారు.

వీటికి సానుకూలంగా స్పందించిన తీన్మార్ మల్లన్న గెలిచిన అనంతరం చట్టసభల్లో మీ తరఫున ప్రశ్నించుటకు సిద్ధంగా ఉన్నానని తమకు కాంగ్రెస్ పార్టీ అన్నివేళలా తోడుగా ఉంటుందని గత ప్రభుత్వ పాలకుల వల్ల గెస్ట్ టీచర్లకు లెక్చలర్లకు అన్యాయం జరిగిందని ప్రభుత్వ పాలనలో ఈ విధంగా జరగదని తెలిపారు. ఇవన్నీ జరగాలంటే 27వ తారీకున జరిగే వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎన్నికల్లో రెండో నెంబర్ పై ఉన్న తీన్మార్ మల్లన్న మొదటి ఓటు ప్రాధాన్యత వేసి మొదటి ఓటు ప్రాధాన్యత వేసి అత్యధిక మెజార్టీతో చట్టసభల్లో పంపాలని కోరారు . ఈ కార్యక్రమంలో నల్గొండ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, కౌన్సిలర్ సమథ్, %వీభీూదీజఔ=×ఝూ% జస్ట్ ఫ్యాకల్టీ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ గౌస్ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ ప్రవీణ్ లింగస్వామి ఎల్లయ్య మహమ్మద్ నుస్రత్ అలీ , విజయ్ కుమారి, సునీత షకీలా, వివిధ జిల్లాల కార్యవర్గ సభ్యులు గోవింద్ ప్రభాకర్ వెంకటేష్ కృష్ణ రవీందర్ ప్రమీల అనుశ్రీ మంజుల తదితరులు పాల్గొన్నారు.

# వంగర సత్తయ్యను పరామర్శించిన సిపిఎం నాయకులు



**నల్లగొండ జిల్లా ప్రతి నిధి.మే 25 (క్విక్ టుడే) :** చర్లపల్లి మాజీ సర్పంచ్ సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ వంగర సత్తయ్య ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటుండగా సిపిఎం నాయకులు పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నరు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం , నల్లగొండ పట్టణ కార్యదర్శి ఎండి సలీం ,జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, పట్టణ కమిటీ సభ్యులు అద్దంకి నర్సింహ, మధుసూదన్ రెడ్డి, నరేష్, సైదాచారి తదితర పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# జనసునామీతో తీవ్ర నష్టం!



భారతదేశ జనాభా అధికారికంగా 140కోట్లు..అప్పనంగా వచ్చి చేరిన వారు, లెక్కలు సరిగా కట్టకపోవడం కలిపితే ఇంకో ఐదారు కోట్లు చేరుతుంది. ఇంతమంది జనాభాకు ఎన్ని తిండిగింజలు అవసరం అవుతాయి.. ఎన్ని రకాల పప్పుధాన్యాలు, నూనెలు ఎంత అవసరమో అన్నది ముఖ్యం. అలాగే వీరందరికీ గూడు కూడా ముఖ్యమే. కానీ 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలా జనాభాకు తగ్గట్లుగా ప్రణాళికలు వేయడం లేదు. అలాగే ఈ మానవులను ఉపయోగించి అద్భుతాలు సృష్టించవచ్చని కూడా ఆలోచించడం లేదు. కేవలం కొందరిని గుర్తించి వారికి వండివార్చుడమెలా అన్నదే ఆలోచిస్తున్నారు. అలా వండివార్చుడం వెనకా పరామర్థం ఉంది. వారంతా ఓటు వేస్తారన్న నమ్మకంతో ఇలాంటి వంటావార్పులు అంటే..పథకాల పేరుతో పందేరాలు చేస్తున్నారు. అంతేగానీ మానవవనరులను ఉపయోగించి దేశానికి ఎలా పునాదులు వేయాలో అన్న ఆలోచనలు నేతల్లో కానరావడం లేదు. ఐదేళ్ల పదవీకాలం కోసం పోరాటం.. ఆ తరవాత మరో ఐదేళ్లకు ప్రణాళికలతో భారత ఎన్నికల తంతు సాగుతోంది. అందుకే మనదేశంలో చదువుకున్న వారికి ఉద్యోగాలు రావడం లేదు. చదువుకోలేని వారికి ఉపాధి దక్కడం లేదు. ఉచితాలు పొదేవారు హాయిగా ఉంటున్నారు. ఇలాంటి చర్యల కారణంగా దేశం ఏటేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి, అడుగులు ముందుకు వేయడం లేదు. చైనాతో పోలిస్తే..మానవ వనరుల వినయోగంలో భారత్ ఎప్పుడూ వెనకబడే ఉంటోంది. మానవ వనరుల వినయోగానికి సంబంధించి సరైన ప్రణాళికలు ప్రభుత్వం వద్ద లేవు. దేశంలో ఉన్న సహజ వనరులతో పాటు మనావ వనరులను జోడించాలన్న ఆలోచన ఏ ప్రభుత్వానికి కూడా లేకుండా పోయింది. ద్రవ్యోల్బణం,ప్రపంచ వ్యాప్తంగా మాంద్యం, అంతర్జాతీయంగా భౌగోళికంగా, రాజకీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు వంటి సమస్యలున్నా భారత్ తన జనాభాను ముఖ్యంగా యువతను సరైన విధంగా వినియోగించుకుంటే అద్భుతమైన ప్రగతిని నమోదు చేయవచ్చు. అంతర్జాతీయ సంస్థలు, నిపుణులు కూడా దీనిని విశ్లేషిస్తున్నారు. అయితే ఉపయోగం మాట అలా వుంచితే జీవన పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయి. మనదేశంలో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉంటున్నది. ప్రభుత్వపరంగా ఎదురవుతున్న వివక్ష, నిర్లక్ష్యం వల్ల కూడా పెద్ద సంఖ్యలో అవిద్య, ఆకలిదప్పులకు లోనవుతున్నారు. పెరిగిపోతున్న వృద్ధ జనాభాకు అవసరమైన వైద్య చికిత్సలను అందించటం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. పలు ధనిక దేశాల్లో ఇప్పుడు ఈ సమస్య ఉన్నది. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకైతే ఈ వ్యయాన్ని భరించటం దాదాపుగా అసాధ్యం అనే చెప్పాలి. దీంతో మన దేశంలో జనాభా వృద్ధి తప్ప అభివృద్ధి కానరావడం లేదు. నేటికి ఆకలి దప్పులు, అనారోగ్యం తప్పడం లేదు. రాజకీయ వ్యవస్థ మాత్రమే బాగు పడుతోంది. తమకు అనుకూలంగా చట్టాలు చేసుకోవడం, అవసర మైతే తుంగలో తొక్కడం అన్న చందంగా మన వ్యవస్థ సాగుతోంది. భారతదేశ జనాభాలో సగం మంది 30 ఏండ్లలోపు వారే అని గణాంకాలు చెబుతున్నాయి. అంటే, దాదాపు 72 కోట్ల మందితో కూడిన యువశక్తి ఉన్న దేశం మనది. ప్రపంచంలో ఏ దేశం వద్దా ఇంతటి యువశక్తి లేదు. సరైన విద్యను అందించటం ద్వారా, ఉద్యోగ నైపుణ్యాల కు సంబంధించి నిరంతర శిక్షణ ఇవ్వటం ద్వారా యువశక్తి ప్రతిభ సామర్థ్యాలను దేశం ఉపయోగించు కోవచ్చు. అందుకు మనదగ్గర సహజవనరులకు కూడా కొదువ లేదు. భూమి,నీరు పుష్కలం గా ఉన్నాయి. వీటిని వినియోగించుకుంటే దేశం ఎంతగానో పురోగ మిస్తుంది. చైనాను అధిగమించి భూగోళం మీద అత్యధిక జనాభా రికార్డు సృష్టించామని చెప్పుకునే ముందు దానితోపాటు వచ్చే సమస్యల పైనా దృష్టిపెట్టాలి. ఆ సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలిక ప్రణాళి కలు అవసరమవుతాయి. ప్రజలకు నాణ్యతతో కూడిన జీవనాన్ని ఇవ్వటానికి అవసరమైన ధృఢమైన నిర్ణయాలు, మెరుగైన విద్య, వైద్యం, నైపుణ్యాలు, ఉద్యోగాలు అవసరమవుతాయి. వీటన్నింటిపై ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తుల స్థాయిలో సమగ్రమైన కార్యాచరణ జరుగాలి. అయితే అధిక జనాభా ఉండటం కూడా సమస్యే తప్ప మరోటి కాదు. దానితో ఉండే సమస్యలు దానికున్నాయి. జనాభాను దేశానికి పరిమితమైన అంశంగా కాక, అంతర్జాతీయంగా ప్రభావం చూపే అంశంగా గుర్తించాలి. జనాభాకు తగ్గట్టుగా ఆహారధాన్యాలు, ఆవాసాలు, గాలి,నీరు అవసరం కూడా. ముఖ్యంగా వాతావరణ మార్పులు కీలకమైనవి. భూమ్మీద జీవ వైవిధ్యానికి ఎదురవుతున్న సవాళ్లపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ప్రతికూల వాతావరణ మార్పుల వల్ల ప్రజల వలసలు రానున్న రోజుల్లో విపరీతంగా పెరిగిపోయే అవకాశం ఉన్నదని ఈ సంస్థ చెప్తున్నది. అధిక జనాభా వల్ల నివాసయోగ్యమైన ప్రాంతాలు కుదించుకు పోతున్నాయి. దీవులు, తీరప్రాంతాలు మునిగిపోతున్నాయి. మనుగడ కోసం వన్యప్రాణులకు, మనుషులకు మధ్య ఘర్షణ పెరిగే ప్రమాదం ఏర్పడుతున్నది. అడవుల నరికివేత, కొండలు, గుట్టలు కొట్టేయడం వల్ల పర్యావరణ సమతులతులత్య దెబ్బతింటోంది. మంచి నీళ్లు, గాలి తగ్గుతున్నాయి. ఇవన్నీ ఏవో కాకిలెక్కలు కావు. ప్రపంచ వ్యాప్తంగా తరచూ వెలువడుతున్న పరిశోధనల నివేదికలు, అధ్యయనాలు చేస్తున్న హెచ్చరికలు. అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ వీటిని విస్మరించ రాదు. కచ్చితంగా వీటిపై అధ్యయనం జరిపి, తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఏ విషయం లోనూ జాగ్రత్తలు తీసుకోవడం లేదు. అధికా జనాభా విస్ఫోటనంలో మనం ముదున్నాం. చైనాను అధిగమించాం. దీనిని కట్టడి చేసకోవాల్సి ఉంది. జనాభా నియంత్రణ అన్నది యుద్ధప్రాతిపదికన సాగాల్సి ఉంది. ప్రస్తుతం ఆర్థిక వృద్ధి రేటు దాదాపు ఆరు శాతంగా నమోదవుతున్నది. మార్పుల కారణంగా కావచ్చు..ఆహార లభ్యత కావచ్చు..ఉన్నత జీవన ప్రమాణాలు కావచ్చు.. గత శతాబ్ద కాలంలో ఔషధ రంగంలో చోటుచేసుకుంటున్న అత్యాధునిక మార్పుల వల్ల కావచ్చు..మానవ జీవితకాలం దాదాపు రెట్టింపయ్యింది. 2019లో దేశ జనాభాలో అరవై ఏండ్లు లేదా అంతకన్నా ఎక్కువ వయసున్న వారు పది శాతమే. కానీ, 2050 నాటికి వారి సంఖ్య 19.6 శాతానికి పెరుగుతుంది. అంటే, మరో 25 ఏండ్లపాటు మన వద్ద తిరుగులేని యువశక్తి ఉన్నప్పటికీ, వృద్ధుల సంఖ్య కూడా తక్కువేమీ ఉండదు. వీరి సంఖ్య దాదాపు 30 కోట్లకు చేరుకుంటుంది. వీరందరికీ మంచి జీవనాన్ని కల్పించటం సవాల్ లాంటిదే. ఇకపోతే తాజా అంచనాల ప్రకారం ఆయుః ప్రమాణం మరింత పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయని అంటున్నారు. తరచూ ఏదో ఒక చికిత్స తీసుకునే వృద్ధ జనాభాతోనే తమకు ఎక్కువ లాభం కాబట్టి, మానవ ఆయుః ప్రమాణం పెరుగుదల లో ఔషధరంగం పాత్ర కూడా లేకపోలేదన్న వాదనలున్నాయి. పెరుగుతున్న జనాభా వల్ల భూమి, అడవులు, జల వనరులు, గాలి వంటి సహజ వనరులపై తీవ్రమైన ఒత్తిడి పడుతోంది. ఇప్పటికే పర్యావరణ సమస్య తీవ్రంగా ఉంది. ఇవన్నీ ప్రభుత్వాలు తీవ్రంగా అధ్యయనం చేయాల్సిన అంశాలు. అప్పుడే మన సమస్యలను మనం పరిష్కరించుకోగలమని పాలకులు గుర్తించి నడుచుకోవాలి.

# వానాకాలం సాగుకు సన్నద్ధం

**- ముందస్తు రుతపవనాల రాకతో అప్రమత్తం - వరితో పాటు ఆరుతడి పంటలకు ప్రోత్సాహం**

**నిజామాబాద్,మే25:** జిల్లాలో వానాకాలం పంటల సాగుకు వ్యవసాయాశాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ యేడాది రుతుపవనాలు జూన్ మొదటి వారంలోనే వచ్చే అవకాశం ఉంటుందన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో జిల్లా వ్యవసాయాధికారులు పంటల సాగు ప్రణాళిక సిద్ధం చేసేపనిలో ఉన్నారు. రైతుల సాగుకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో వరిసాగు ఎక్కువగా ఉన్నందు వల్ల ఈ పంటను అత్యాధునిక పరిజ్ఞానంతో పండించే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఖర్చు తగ్గించి ఎక్కువ దిగుబడి వచ్చే పద్ధతులను రైతులకు వివరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో వరితో పాటు ఆరుతడి పంటలను కూడా ఎక్కువమొత్తంలో సాగయ్యే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వానాకాలంలో రైతులకు పంటలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరుతడి పంటలను ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పంటల కాలనీ ఏర్పాటులో భాగంగా వరి సాగులో అత్యాధునిక పద్ధతులను రైతులు అవలంబించేవిదంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వరిలో విత్తనాలు వెదజల్లే పద్ధతిని ప్రొత్సహించేందుకు సిద్ధమవుతున్నారు. వానకాలం సీజన్‌లో సరిపడా విత్తనాలు, ఎరువులను సమకూరు స్తునే సీజన్ ప్రారంభానికి ముందే అన్ని క్లస్టర్‌ల పరిధిలో రైతులకు అత్యాధునిక పద్ధతులను వివరించేం దుకు ఏర్పాట్లను చేస్తున్నారు. విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కొన్ని రకాల విత్తనాలు సరఫరా చేస్తున్నామని, ఇతర విత్తనాలను ప్రైవేట్ విత్తన సంస్థల ద్వారా కొనుగోలు చేసుకోవాలన్నారు. వానకాలం సీజన్‌లో ఏ పంటలు ఎక్కువగా పెరగనున్నాయో యాక్షన్ ప్లాన్‌లో పొందుపర్చారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం రైతులకు ఆరుతడి పంటల సాగును



వివరించడంతో పాటు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పంటలకు అనుగుణంగా విత్తనాలను సమకూర్చాలని ప్రభుత్వానికి పంపిన ప్రణాళికల్లో పేర్కొన్నారు. జిల్లాలో పత్తి సాగును కొత్తగా మొదలుపెడుతున్నందు వల్ల అవసరమైన విత్తనాలను ప్రణాళికలో పొందుపర్చారు. వెదజల్లే పద్ధతికి ప్రోత్సాహం జిల్లాలో వచ్చే వానాకాలం సాగు కోసం వరిలో వెదజల్లే పద్ధతిని ప్రోత్సహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వ్యవసాయంలో ఖర్చు తగ్గించడంతో పాటు దిగుబడి పెంచడంలో భాగంగా ఈ పద్ధతిని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

# పత్తికి మొగ్గుచూపుతున్న రైతులు



## నకిలీ విత్తనాలపై కన్నేసిన అధికారులు

**ఆదిలాబాద్,మే25** ఊహించినట్టుగానే ఈ ఏడాది కూడా జిల్లాలో పత్తి పంటే అధిక విస్తీర్ణంలో సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వరికి నీటి తడులు ఎకకువగా అవసరంతో పాటు, ఖర్చుకూడా తడిసి మోపెడు అవుతోంది. కూలీల సమస్య కూడా ఉంటోంది. దీనికితోడు పత్తి తప్ప ఏ పంట వేసినా కోతుల బెడద కూడా దెబ్బతీస్తోంది. ఈ క్రమంలో రైతులు వరికన్నా పత్తి మేలని భావిస్తున్నారు. మరోవైపు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ పత్తి విత్తన కంపెనీలు ఏటా ముంచుతున్నాయి. అయితే ఈయేడు ఇప్పటినుంచే దాడులు చేసి పట్టుకుంటున్నారు. రైతులు విత్తన కొనుగోళ్లో జాగ్రత్తగా ఉండేలా హెచ్చరికలు చేస్తున్నారు. పత్తికి తోడు కంది, వరి, జొన్న, పెసర, మినుములు వంటి ఇతర పంటలను కూడా సాగు చేయవచ్చని అధికారులు సూచనలు వేశారు. ఇవి కాకుండా పోషకాహార పంటలైన చిరుధాన్యాల పంటలను సాగు చేసేందుకు ప్రత్యేకంగా చర్య లు చేపడుతున్నారు. ఇందుకు గాను వందశాతం సబ్సిడీపై రైతులకు చిరుధాన్యం విత్తనాలను పంపిణీ చేయనున్నారు. ఇవి కాకుండా ఉద్యానవనశాఖ ద్వారా వివిధ రకాల కూరగాయాల పంటలు సాగు అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా కాగజ్ నగర్, ఆసిఫాబాద్ పట్టణాలకు సమీపంలో ఉండే మండలాల్లో కూర గాయాల సాగును ప్రొత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. జిల్లాలో పత్తి సాగుకు సంబంధించి యేటా అంచనాలకు మించి ఉంటున్న నేపథ్యంలో సీజన్ ప్రారంభమైన తర్వాత సాగు విస్తీర్ణం కాస్తా అటు ఇటుగా మారే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

# టిడిపి మహానాడుకు సెలవు

**- ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రద్దు**

**- కేవలం జెండా పండగలతోనే ఈయేడు సరి**

**విజయవాడ,మే25:** ఏటా మేనెల 27, 28 తేదీల్లో టిడిపిమహానాడుకు భారీగా ఏర్పాట్లు జరిగేవి. మూడ్రోజులపాటు అట్టహాసంగా మహానాడు సాగేది. దివంగత ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మహానాడు సాగేది. ఎన్టీఆర్ ఉన్నప్పటి నుంచే ఇది మొదలయ్యింది. టిడిపి అధికారంలో ఉన్నా, లేకున్నా మహానాడులో ఎలాంటి లోటులేకుండా సాగేది. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. ఈ తేదీలకు నాలుగు రోజుల తరవాత ఎన్నికల ఫలితాలు రాబోతున్నాయి. దీంతో టిడిపి శ్రేణులంతా కౌంటింగ్ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సి రావడంతో ఈ యేడు మహానాడును వాయిదా వేశారు. కేవలం గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు, రక్తదానాలు వంటివి చేయాలని టిడిపి అధినాయకత్వం నిర్ణయించింది. గతేడాది తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరం వేదకయ్యింది. ఏటా మహానాడు పర్వదినం సందర్భంగా జిల్లాలన్నీ పసుపుమయం అయ్యేవి ప్రతి ఇంటి నుంచి జనం తరలి రావాలని ఇచ్చిన పిలుపు ఇచ్చేవారు. నేపథ్యంలో ఎవరికి వారు పసుపు తోరణాలు, ఫెక్సీలు, జెండాలు ఏర్పాటు చేసేవారు. మహానాడు కార్యక్రమాలు నిర్వహించడానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు సిద్దం చేసేవారు. ప్రతి నియోజకవర్గం నుంచి పార్టీ అభిమానులు మహానాడుకు తరలివచ్చే విధంగా ఆర్టీసీ బస్సులను సమకూర్చేవారు. అయితే ఈ యేడు ఎన్నికల కారణంగా ఆ సంబరాలు నిర్వహించడం లేదు. కేవలం జెండా పండగలకే పరిమితం కాబోతున్నారు. అధికారంలోకి వస్తే అంతకు మించి అన్నట్లుగా మహానాడు జరగడం ఖాయం.

# రోహిణీకార్తె ప్రారంభం

**ఎండలు మండడం ఖాయం**

**హైదరాబాద్,మే25:** రోహిణి కార్తె శనివావారం మే25న ప్రారంభమైంది. దీని ప్రభావం శుక్రవారం నుంచే మొదలయ్యింది. జూన్ 8 వరకూ ఉంటుంది. దాదాపు 15 రోజుల పాటూ ఎండలు మండి పోనున్నాయి. నాలుగు నెలల ఎండాకాలంలో ఎండలు తొలి రోజుల్లో కొద్దికొద్దిగా పెరిగి ఉగాది నుండివేసవితాపం పెరుగుతుంది. దిన దిన ప్రవర్ధనమానంగా సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని చూపిస్తాడు. రోహిణి కార్తె 15 రోజుల్లో సూర్యుడి తీవ్రత తారాస్థాయికి చేరి ఆ తర్వాత నుంచి మళ్లీ నెమ్మదిగా తగ్గుతూ ఉంటుంది. రోహిణి తరవాత మృగశర కార్తె ఆరంభం అవు తుంది. వర్షాలు పడడంతో అప్పుడు వాతావరణం చల్లబడుతుంది. 27 నక్షత్రాలు, గ్రహాల ఆధారంగా పంచాంగాలు తయారు చేశారు. జాతకాలు నిర్ణయిస్తారు. సూర్యోదయం సమయానికి ఏ నక్షత్రం చంద్రుడికి దగ్గరగా ఉంటే ఆ రోజుకు ఆ నక్షత్రం పేరు పెట్టారు. పౌర్ణమి రోజు చంద్రుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటే ఆ నెలకు ఆ పేరు పెట్టారు. కానీ తెలుగు రైతులు మాత్రం ఇవే నక్షత్రాలతో వ్యవసాయ పంచాంగం తయారు చేసుకున్నారు. ఈ నక్షత్రాలను కార్తెలు అని పిలుచుకుంటు న్నారు. రైతుల లెక్కల ప్రకారం సూర్యుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటే ఆ కాలానికి ఆ కార్తె పేరు పెట్టారు. అలా సంవత్సరానికి 27 కార్తెలు. తెలుగు రైతులంతా తమ అనుభవం నుంచి సంపాదించుకున్న వ్యవసాయ విజ్ఞానాన్ని కార్తెలుగా వాటిని అందరకీ అర్థమయ్యేలా సామెతల రూపంలో అందరకీ అర్థమయ్యేలా చెప్పారు. అందులో ఒకటి రోహిణి కార్తె. రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు అని నిర్ధారించారు. మాములుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేమంటే ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఎండలు దంచికొడతాయి. అన్ని కార్తెల కన్నా రోహిణి కార్తె అంటే బంబేలెత్తిపోతారు. ఈ కార్తెలో ఎండలు మండిపోతాయని చెప్పడానికి బదులు రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయంటారు.అంటే వేడి తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందో అని చెప్పడమే దీని ఉద్దేశం. వానలు సరైన సమయంలో పడితే రోహిణి కార్తెలోనే వ్యవసాయ పనులు ప్రారంభం అవుతాయి. దీంతో రైతులు పంటలు సాగు చేసేందుకు ముందుకు వస్తారు. రోళ్లు పగిలే ఎండలతో ఉక్కిరిబిక్కిరి చేసి రోహిణి కార్తెతో ఎండాకాలం అంతమైపోతుంది. దీని తరువాత ఒక్కో కార్తె వస్తూ ఉంటాయి. ఇలా వ్యవసాయ దారాలు ఒక్కో కార్తెలో ఒక్కో రకమైన వ్యవసాయ పనులు చేస్తుంటారు. ఎండలు మండే రోహిణి కార్తెలో పశువులు, పక్షులకు తాగేందుకు ఎక్కడిక్కకడ నీళ్లతొట్టెలు ఏర్పాటు చేయడం చాలా మంచిది. మీరు ప్రత్యేకంగా ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు..కనీసం మీ ఇంటి చుట్టుపక్కలైనా మూగజీవాలకు నీళ్లు అందించండి. చలివేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల కూడా మీకున్న గ్రహదోషాల నుంచి విముక్తి లభిస్తుందని చెబుతారు పండితులు.

# భక్తజన సంద్రంగా యాదాద్రి



**యాదగిరిగుట్ట,మే25:** వేసవి సెలవులు ముగుస్తుండటంతో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూ కాంప్లెక్స్‌లో నిరీక్షిస్తున్నారు. ధర్మ దర్శనానికి 3 గంటలు.. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటలు సమయం పడుతోంది. కొండకింద ఆధ్యాత్మిక వాడలోని పుష్కరిణి ప్రాంగణం, వాహనాల పార్కింగ్, వ్రత మండపం భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్వామివారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

# అవతరణ వేడుకలకు ఏర్పాట్లు

**దశాబ్ది ఉత్సవాలకు ఆదేశాలు**

**నిర్మల్,మే25:** రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దశాబ్ది ఉత్సవాల కారణంగా ఈ సంవత్సరం అంగరంగ వైభవంగా వేడుకలను జరుపుకోవడం జరుగుతుందని, అందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జూన్ 2వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలపై ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రప్రభుత్వం మార్గదర్శకాలు, ఆదేశాలకు అనుగుణంగా జూన్ 2న జిల్లా, డివిజన్, మండలం, పంచాయ తీలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. కార్యాలయంలో విద్యుత్ దీపాలతో అలంకరించాలని, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయాలని అన్నారు. వేడుకల సందర్భంగా అంత రాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన ఆవార్డుల లిస్టునుసమర్పించాలని తెలిపారు.

# ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యం

**సోమవారం వైన్ షాపుల బంద్‌కు ఆదేశం**

**హైదరాబాద్,మే25:** మందుబాబులకు ఎన్నికల సంఘం మరోసారి చేదు వార్త చెప్పింది. ఇటీవలే లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగిన నేపథ్యంలో తెలంగాణలో రెండు రోజుల పాటు వైన్ షాపులు, బార్లు మూతపడిన సంగతి తెలిసింది. ఇప్పుడు మరోసారి లిక్కర్ షాపులు క్లోజ్ కానున్నాయి.

# రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వేడి

**- సోమవారం నాటి ఎన్నిక కోసం పోటాపోటీ ప్రచారం - మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా ఉప ఎన్నిక**





**వరంగల్,మే25:** రాష్ట్రంలో ఎన్నికల వేడి ఇంకా తగ్గలేదు. సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికతో ఈ తంతు ముగియ నుంది. ఆరు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. పది రోజుల క్రితం లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. అయినా తెలంగాణలో ఎన్నికల హడావుడి ఇంకా పోలేదు. సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరగనున్నది. ఇక్కడ పట్టు సాధించి అన్ని వర్గాల్లో తమకే ఆదరణ ఉందని చెప్పుకునేందుకు అన్ని పార్టీలు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నాయి. ఎమ్మెల్సీ ప్రచారం ప్రచారం శనివారం సాయంత్రంతో ముగియనుంది. దీంతో సోమవారం జరిగే పోలింగ్‌లో ఎవరి పక్షాన పట్టభద్రులు నిలుస్తారనే ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. తెలంగాణలో నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఉపఎన్నికల సోమవారం జరగనుంది. అన్ని పార్టీలు పట్టభద్రులను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా ఉన్నాయి. ఆయా పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో కూడా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు హోరాహోరీగా తలపడుతున్నారు. అందుకే పేరుకే ఎమ్మెల్సీ ఉపఎన్నిక అయినా అసెంబ్లీ ఎన్నికల స్థాయిలో ప్రచారం, ప్రలోభాలు సాగుతున్నట్టు చర్చ నడుస్తోంది. ఈ స్థానంలో ఎమ్మెల్సీగా ఉన్న బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి పోటీ చేశారు. విజయం సాధించారు. దీంతో ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో ఇక్కడ ఉపఎన్నిక వచ్చింది. ఇప్పుడు ఈ స్థానంలో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ తరపున ఏనుగల రాకేశ్‌రెడ్డి బరిలో ఉన్నారు. రాజేశ్వర్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన తమ స్థానాన్ని దక్కించుకునందుకు బీఆర్ఎస్ శాయశక్తుల పోరాడుతోంది. దీన్ని కైవశం చేసుకొని పట్టభద్రుల్లో కూడా తమకే పట్టు ఉందని నిరూపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్రం గా శ్రమిస్తోంది. ఈ సీటు దక్కించుకుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెక్ పెట్టవచ్చనే ఆలోచన బీజేపీ ఉంది. ఈ మూడు పార్టీల వ్యూహాలతో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక చాలా హీట్ పుట్టిస్తోంది. మూడు పార్టీలు కూడా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రచారం కూడా అదే స్థాయిలో చేస్తున్నాయి. ఇంటిం టికీ వెళ్లి ఓట్లు అడగడంతో పాటు ఆత్మీయ సమ్మేళ నాలు, ఇతర పేర్లతో విద్యావంతులకు చేరువ అ య్యేందుకు శ్రమించారు. ÷ఖన్‌మార్ మల్లన తరపున సీఎం రేవంత్ రెడ్డి, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు విస్తృత ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి తరపున కేటీఆర్, హరీష్ రావు సుడిగాలి పర్యట నలు చేసి తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని విద్యావంతులకు విజ్ఞప్తి చేశారు. తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు అమలు చేయలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి తరపున రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, డీకే అరుణ, ఈటల రాజేందర్ సహా కీలకమైన నేతలంతా ప్రచారం చేశారు. మోదీ పాలన, బీజేపీ విధానాలు మెచ్చి చదువు కున్న వ్యక్తిని చట్టసభలకు పంపించాలని బీజేపీ నేతలు ప్రచారం చేశారు. ఇలా మూడు పార్టీల హోరాహోరీ ప్రచారంతో జరిగే ఒక్క ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కూడా రాజకీయంగా కాక రేపుతోంది.

## పదేళ్లలో బిఆర్ఎస్ ఉద్యోగాలు ఇవ్వలేదు

**ఇస్తే నిరుద్యోగులు ఎందుకు ప్రశ్నిస్తారు**

**ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో ఈటెల విమర్శలు**



**ఖమ్మం,మే25:** పదేళ్లలో భారాస ఉద్యోగాలు కల్పించలేకపోయిందని భాజపా నేత ఈటల రాజేందర్ విమర్శించారు. అలా కల్పించివుంటే ఇవాళ నిరుద్యోగులు ఎందుకు ప్రశ్నిస్తారని అన్నారు. ఉద్యోగాలు కల్పించక పోగా ..ఇచ్చామని చెప్పడం మరింత దారుణమని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇల్లందులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడే ఏమీ చేయని భారాస ఇప్పుడెలా చేస్తుందని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాలు పక్కదారి పట్టాయన్నారు. కాంగ్రెస్ డిక్లరేషన్లు, సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం మాత్రమే అమలవుతోందని చెప్పారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. పట్టభద్రులను చిన్నచూపు చూసిన పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాల నోటిఫికేషన్లు రావడం లేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు.

## విజయవాడను ముంచెత్తిన భారీ వర్షం

**జలమయమైన నగర రహదారులు**



**విజయవాడ,మే25:** విజయవాడలో పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమై.. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బెంజి సర్కిల్, మొఘల్రాజపురం, ఏలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోకి వరద చేరింది. మరోవైపు అనంతపురం జిల్లా ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. బూదగవి చెరువు అలుగు పారుతోంది. విడపనకల్లు మండలంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలాయి. దీంతో 19 గ్రామాలకు రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెంచులపాడు-పాలికి, పాల్తూరు-గోవిందవాడ గ్రామాల మధ్య వాహన రాకపోకలు నిలిచిపోయాయి. పొలాల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. వాయుగుండం ప్రభావంతో కాకినాడ జిల్లావ్యాప్తంగా పలుచోట్ల శుక్రవారం భారీ వర్షం పడింది. ఈదురుగాలులతోపాటు కుండపోతగా వాన కురిసింది. కాకినాడ నగరంలో ఏకధాటిగా మూడు గంటలపాటు వర్షం కుంభవృష్టిగా కురిసింది. దీంతో ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 8.30 వరకు ఏకంగా 10.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వాయుగుండం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఈనేపథ్యంలో ఈనెల 27వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకువెళ్లొద్దని హెచ్చరికలు జారీ అయ్యాయి. శనివారం పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అనకాపల్లి జిల్లాల్లోని 35 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశముందని చెప్పారు.

# వాయుగుండంగా బలపడిన అల్పపీడనం

**తమిళనాట పలు జిల్లాలకు వర్ష హెచ్చరిక**

**చెన్నై,మే25:** బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా బలపడటంతో తమిళనాడు రాష్ట్రంలోని పదిజిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బుధవారం ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి ఈశాన్య దిశగా కదులుతూ శుక్రవారం ఉదయం వాయుగుండంగా మారింది. ప్రస్తుతం ఆ వాయుగుండం బంగ్లాదేశ్‌కు నైరుతి దిశగా 800 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. అది మరింతగా బలపడి ఈశాన్య దిశగా కదలి శనివారం ఉదయం తుఫానుగా మారి ఉత్తరదిశగా కదలి సాయంత్రానికి మరింత బలపడ నుందని వాతావరణ పరిశోధనా కేంద్రం అధికారులు ప్రకటించారు. ఈ తుఫాను ఈ నెల 26 అర్ధరాత్రి మరింత ఉగ్రరూపం దాల్చి పడమటి బంగాళాఖాతం తీరం సమీపంలోని సాగర్ దీవి, కిప్పురావు మధ్య తీరం దాటనుంది. కేరళ సముద్రతీరంలో ఈశాన్య అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలోని పలు చోట్ల, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం, అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా పది జిల్లాల్లో చెదరుమదురుగా వర్షాలు కురిసే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. కన్నియాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి, తేని, దిండుగల్, నీలగిరి, మదురై, విరుదునగర్, తిరుప్పూరు, తిరునల్వేలి జిల్లాల్లో పలు చోట్ల భారీగా, మరికొన్ని చోట్ల ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయి.

గురువారం ఉదయం నుండి శుక్రవారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం వివరాల ప్రకారం తిరునల్వేలిలో అత్యధికంగా 10 సెం.మీ.ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు పేర్కొన్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారటంతో పుదుచ్చేరి సహా తొమ్మిది ఓడరేవుల్లో ఒకటో నెంబర్ సూచిక ఎగురవేశారు. చెన్నై, కడలూరు, నాగపట్టినం, ఎన్నూరు, కాట్టుపల్లి, పుదుచ్చేరి, కారైక్కాల్, పాంబన్, తూత్తుకుడి హార్బర్‌లలో ఈ సూచికలను ఎగురవేసినట్లు అధికారులు పేర్కొన్నారు. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నీలగిరి జిల్లా కున్నూరు సమీపంలోని ఇరువయల్ గిరిజన ప్రాంతాల్లో వరద పోటెత్తింది.

ఆ ప్రాంతంలో పలు వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రహదారుల్లో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఊటీ, కున్నూరు, కోథగిరి పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం నుండి శుక్రవారం వేకువజాము వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఊటీ బోట్‌హౌస్ రోడ్డుపై వర్షపు నీరు వరదలా ప్రవహించింది. ఇక రెండు రోజుల వర్షానికి కున్నూరు సమీపం ఇరువయల్ గ్రామం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. రహదారుల్లో కూలిన చెట్లను అగ్నిమాపక దళం సభ్యులు తొలగిస్తున్నారు.

## కాంబోడియాలో చిక్కుకున్న తెలుగువారు

**సైబర్ నేరస్థుల ఉచ్చు నుంచి కాపాడాలి**

**కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి**



**అమరావతి,మే25:** కాంబోడియాలో చిక్కుకున్న తెలుగు యువతను కాపాడాలని టీడీపీ అధినేత చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మానవ అక్రమ రవాణాకు ఏపీ కేంద్రంగా మారడం ఆందోళనకరమని ఆయన ఎక్స్(ట్విటర్) వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. 150మందిని స్వదేశానికి తీసుకొచ్చేలా సహాయపడాలని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాల పేరుతో రాష్ట్ర యువతను అక్రమంగా కాంబోడియా తరలించి సైబర్ నేరాల ఉచ్చులోకి నెట్టారన్నారు. యువతను నాశనం చేస్తున్న నకిలీ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యువత ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాకపోవడంతో నిరాశలో కూరుకుపోతున్నారు. ఇదే అదునుగా మంచి జీతం, విదేశాల్లో ఉద్యోగాలంటూ కొంతమంది మోసాలకు పాల్పడుతున్నారు. ఇదే తరహాలో కాంబోడియా సైబర్ నేరగాళ్ల వలకు దేశ యువత చిక్కారు. సుమారు 5వేల మంది యువత వారి చేతిలో చిక్కినట్లు తెలుస్తోంది. అందులో 150మంది తెలుగు యువత ఉన్నారు. నిరుద్యోగులను కాంబోడియా తీసుకువెళ్లిన ఏజెంట్లు వారిని సైబర్ నేరగాళ్లకు అప్పగించారు. వారిని బందీలుగా చేసుకుని చిత్రహింసలకు గురిచేస్తూ వారితో సైబర్ నేరాలు చేయిస్తున్నారు. నేరాలకు పాల్పడకపోతే ఆహారం, మంచి నీళ్లు ఇవ్వకుండా చీకటి గదిలో బంధించి చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. త్వరితగతిన చర్యలు చేపట్టి బాధితులను త్వరగా స్వదేశానికి తరలించాలని ఎక్స్ వేదికగా చంద్రబాబు కేంద్రాన్ని కోరారు.

## వైసిపి నేత దారుణ హత్య

**మదనపల్లె,మే25:** అన్నమయ్య జిల్లా మదనప్లలె పట్టణం శ్రీవారినగర్‌లో వైసిపి నాయకుడు పుంగనూరు శేషాద్రి దారుణ హత్యకు గురయ్యారు. శేషాద్రి ఇంట్లోకి దూరిన దుండగులు కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేయడంతో శేషాద్రి రక్తపుమడుగులో కుప్పకూలారు. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. దుండగులు పరారీ కాగా.. వారిని పట్టుకునే పనిలో పోలీసులు నిమగమయ్యారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# మైసూర్‌లో మోడీ హోటల్ బిల్లు వ్యవహారం

**- బిల్లు చెల్లింపులో రాష్ట్రం, కేంద్రం మధ్య వివాదం**

**- బిల్లు చెల్లించకుంటే చర్యలు తప్పవని హోటల్ హెచ్చరిక**

**మైసూర్,మే25:** ప్రధాని మోడీ హోటల్‌లో బస చేసినందుకు గాను చెల్లించాల్సిన 80 లక్షల రూపాయల బిల్లు వ్యవహారం వివాదంగా మారింది. అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్రం వీటిని చెల్లించకపోవడంతో చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు మైసూర్ రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్ యాజమాన్యం బెదిరింపులకు దిగింది. వివరాల్లోకి వెళితే.. ప్రధాని మోడీ గతేడాది ఏప్రిల్ నెలలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టిసిఎ), పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ (ఎంఒఇఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 50 సంవత్సరాల ప్రాజెక్టు టైగర్ ఈవెంట్ మైసూర్‌లో జరిగింది. ఈ కార్యక్రమం ఏప్రిల్ 9 నుంచి 11 వరకు జరిగింది. ఈ ఈవెంట్‌ని ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్రమోడీ మైసూర్‌కి వచ్చి అక్కడ ఉన్న రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో బస చేశారు. దీనికిగానూ రూ. 80.6 లక్షల రూపాయల బిల్ అయింది. అయితే ఈ బిల్స్‌ని హోటల్‌కి చెల్లించలేదు. ఈ బకాయిలను చెల్లించాలని కర్ణాటక ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (వైల్డ్ లైఫ్).. న్యూఢిల్లీ ఎన్‌టిసిఎ డప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కి లేఖ రాసింది. అయితే ఈ హోటల్ బకాయిలను కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని ఎన్‌టిసిఎ తిరిగి ఈ ఏడాది ఫిబ్రవరి 12న లేఖ రాసింది. అయితే బకాయిలు చెల్లించక పోవడంతో మరోసారి మార్చి 22వ తేదీన ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ (పిసిసిఎఫ్) ప్రిన్సిపల్ సుభాష్ కె. మల్ఖేడే ఎన్‌టిసిఎకు లేఖ రాశారు.

సుభాష్ రాసిన లేఖకు సంబంధించి ఎన్‌టిసిఎ సమాధానం ఇవ్వలేదు. ఆ తర్వాత 'ఏడాది గడిచినా హోటల్‌లో బస చేసినందుకు బిల్లు చెల్లించలేదు' అని మే 21న ఈ హోటల్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చీఫ్ బసవరాజుకు లేఖ రాశారు. బకాయిలు సరైన సమయంలో చెల్లించనందుగాను 12.09 లక్షలు, మొత్తం డబ్బు సంవత్సరానికి 18 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని బ్లూ ప్లాజా యాజమాన్యం లేఖలో పేర్కొంది. ఈ బకాయిల్ని ఈ ఏడాది జూన్ 1వ తేదీ లోపు చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోటల్ యాజమాన్యం బెదిరించింది. అయితే ఈ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిందన్న కారణంతో.. రాష్ట్ర ప్రభుత్వం ఈ హోటల్‌కి చెల్లించే బకాయిల్ని చెల్లించేందుకు తిరస్కరించిందని ఫారెస్ట్ చీఫ్ బసవరాజు అన్నారు.

# అజ్ఞాతం వీడని పిన్నెల్లి

**రెంటచింతతలో హత్యాయత్నం కేసు నమోదు**

**అమరావతి,మే25:** వైసీపీ నేత, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంకా అజ్ఞాతంలోనే కొనసాగుతున్నారు. ఈవీఎంల ధ్వంసం కేసులో జూన్6 వరకు ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించినప్పటికీ ఎమ్మెల్యే పిన్నెల్లి మాత్రం ఇంకా బయటకురాలేదు. ఓవైపు రామకృష్ణారెడ్డి తప్పించుకు తిరుగుతుంటే.. మరోవైపు ఆయన అరాచకాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. తాజాగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై రెంటచింతల పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. ముందే విషయం తెలుసుకున్న పిన్నెల్లి అజ్ఞాతంలోనే ఉండిపోయారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఓవైపు తాను పారిపోలేదంటూ ప్రగల్భాలు పలికిన పిన్నెల్లి ప్రస్తుతం ఎక్కడ దాక్కున్నారనేది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చినా పిన్నెల్లి బయటకు రాకపోవడంపై ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయి. ఎన్నికల సమయంలో అతడి అరాచకాలు బయటకు వస్తుండటంతోనే భయపడి ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐపీసీ 307 కింద పిన్నెల్లిపై హత్యాయత్నం కేసు నమోదుకావడంతో.. ఈకేసులు అరెస్ట్ అయ్యే అవకాశం ఉందన్న అనుమానంతోనే ఆయన బయటకు రాకపోయిఉండొచ్చనే చర్చ నడుస్తోంది. పాల్వాయి గేట్ గ్రామంలోని పోలింగ్ బూత్‌లో టీడీపీ ఏజెంట్‌గా ఉన్న నంబూరు శేషగిరిరావుపై పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరులు దాడిచేసిన ఘటనపై రెంటచింతట పోలీసులు హత్యాయత్నం కేసు నమోదుచేశారు. పిన్నెల్లి ప్రోద్బలంతోనే తనపై చంపేందుకు ప్రయత్నించారని శేషగిరిరావు పోలీసులకు 161 స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీంతో కోర్టులో మెమ్మో ÷ల్ చేసి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ముందస్తు బెయిల్ ఇస్తూ హైకోర్టు పలు ఆంక్షలు విధించింది. మాచర్ల వెళ్లొద్దని, నరసరావుపేటలోనే ఉండాలని ఆదేశించింది. కోర్టు స్పష్టంగా చెప్పినప్పటికీ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అజ్ఞాతంలోనే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం వరకు నరసరావుపేటలో ఆయన కనిపించలేదు. హత్యాయత్నం కేసు పెడుతున్నారని ముందే తెలుసుకుని పరారయ్యారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. మరోవైపు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దేశంలోనే ఉన్నారా.. విదేశాలకు వెళ్లిపోయారా అని పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

## ఉచిత బస్సు తప్ప ఒక్క హామీ నెరవేర్చలే

**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**

**వరంగల్,మే25:** అరచేతికి తేనె పూసి మోచేత్తో సీఎం రేవంత్‌రెడ్డి నాకమంటున్నాడు. 420 మోసపూరిత హామీలతో గద్దెనెక్కి ఉచిత బస్సు తప్పా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఐదు నెలల పాలనలో ఒక్క జాబు క్యాలెండర్ లేదన్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్ ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు.మూడు వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో నాలుగు లక్షల మందికి పైగా పట్టభద్రులు ఉన్నారు. పట్టభద్రులే నాలుగు కోట్ల ప్రజలకు గొంతుక కావాలన్నారు. మూడు జిల్లాలు చైతన్యానికి ప్రతీక అని ప్రశంసించారు. రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజారాజ్యం పేరుతో పైసల రాజ్యాన్ని నిర్మించుకున్న రేవంత్ రెడ్డికేసీర్ సంక్షేమ పథకాలకు కోత పెట్టారని విమర్శించారు. తీన్మార్ మల్లన్నవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలన్నారు. రేవంత్ రెడ్డి దురహంకారాన్ని గద్దేదించినందుకు ఈ ఎన్నికలు గుణపాఠం కావాలన్నారు. కాకతీయ కళాతోరణం చార్మినార్ తీసేస్తా అన్న రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలన్నారు. రాకేష్ రెడ్డిని గెలిపిస్తేనే జాబ్ క్యాలెండర్ వస్తుంది. నిరుద్యోగ భృతి వస్తుంది. రైతులకు రైతుబంధు రైతు భరోసా వస్తుంది. 18 ఏళ్లు నిండిన అమ్మాయిలకు స్కూటీలు వస్తాయన్నారు.

## భద్రాచలంలో భారీగా గంజాయి పట్టివేత

**భద్రాచలం,మే25:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆశ్వారావుపేటలో భారీగా గంజాయి పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. బొలేరో వాహనంలో తరలిస్తున్న 3.30 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు..

## చెరువులో విషప్రయోగం.. చేపలు మృతి

**సూర్యాపేట,మే25:** చెరువులో విష ప్రయోగం చేయడంతో భారీగా చేపలు మృతి చెందాయి. ఈ సంఘటన సూర్యాపేటజిల్లాలో చోటు చేసుకుంది. సూర్యాపేట పట్టణ పరిధి కుడకుడ 1వ వార్డులోని గుండ్లకుంట చెరువులో విష ప్రయోగం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు క్రిమిసహారక మందు కలపడంతో పెద్ద ఎత్తున చనిపోయిన చేపలు చనిపోయాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


# శివతత్త్వం: నిత్యం.. సత్యం.. అనంతం

పరమశివుడు అర్ధనారీశ్వరుడు. ఆదిభిక్షువు. భక్త వత్సలుడు. బోళాశంకరుడు. నిర్వికారుడు, నిరాకారుడు, నిరాడంబరుడు. ఇన్ని వేదాంత లక్షణాలున్న ఈశ్వరుడు ఏ శివక్షేత్రంలో చూసినా లింగాకారంలోనే కనపడతాడు కాని శరీరాకృతిలో దర్శనమివ్వడు. అదెలాగంటే ఒక వృత్తం తన ఆకారంలో చాలా గొప్పది. అది అనంతమైన మోతాదులో పెరుగుతూ వెళ్లినా దాని కేంద్రం ఒక్కటే. పరిపూర్ణ తత్త్వమనేది ఒక గోళానికి చెందింది. పరిపూర్ణమైన దానిలోని భాగాలన్నీ పరిపూర్ణాలే అని తెలుసుకోగలగడమే ఆధ్యాత్మిక సాధన! అందుకే పౌరాణికవేత్తలు సృష్టి యావత్తూ శివలింగమేనంటారు. అన్ని స్పందనలూ, చేతనలూ ఈశ్వరుడిలోనే, ఈశ్వరుడి వల్లనే అంటారు! అందుకే అటు అనంతం ఇటు అనంతం,పైన అనంతం, కింద అనంతం చుట్టూ తిరిగి చూస్తే సర్వం లింగాకారమే... అదే శివతత్త్వం.

### ప్రతి చర్యలోనూ అంతులేనంతటి అంతరార్థం

శివుణ్ణి దిగంబరుడంటారు. దిగంబరుడంటే దిక్కులే వస్త్రాలుగా కలిగినవాడని అర్థం. అందుకే ఆయన సర్వాంతర్యామి అయ్యాడు. లోకంలో ప్రతివారు కీడును పోగొట్టుకోవడానికి, సంపదలు పొందడానికి మంగళకర ద్రవ్యాలైన సుగంధ చందనాదులను ధరిస్తారు. ఇవి మళ్లీ కోరికలు పుట్టిస్తాయి. కోరికలు లేనివాడయిన శివునికి వీటితో పనిలేదు. అందుకే అన్నింటికీ దూరంగా ఉంటాడు. భాగ్యవంతుడు కాకున్నా కోరిన వారికి సకల సంపదలను ప్రసాదిస్తాడు. సంచరించేది శ్మశానంలోనే అయినా, లోకాన్నిటినీ శాసించగలడు. తనకే సంపదలూ లేకపోతేనేం, ఆయన అనుగ్రహమే గొప్ప సంపద. అంటే మనకు ఏమీ లేకపోయినా, అవతలి వారికి ఇవ్వాలన్న మనసు ఉంటే చాలనీ, పైపై ఆడంబరాలు లేకున్నా, గొప్ప కార్యాలు సాధించడానికి అదేమీ అడ్డం కాదన్నది ఆయన రూపంలోని, చర్యలలోని అంతరార్థంగా భావించాలి.





మహేశ్వరుని వంటి నిరాడంబరుడు మనకెక్కడా దర్శనమివ్వడు. గజచర్మం కట్టుకుంటాడు. చేతిలో కపాలం పట్టుకుని బిచ్చమెత్తుకుంటాడు. కాష్టాలవాడలో కాపురముంటాడు. విషపు నాగులను మెడనిండా మాలలుగా ధరిస్తాడు. రుద్రాక్షపూసల్ని వంటినిండా అలంకరించుకుంటాడు. ఆయన సిగలో చంద్రుడున్నాడని గొప్పలు పోదామంటే అదీ కుదరదు. ఆ శిరస్సున ఉండే చంద్రుడు వెన్నెల సోనలు కురిపించే నిండు చందురుడేమీ కాదు. సన్నని చంద్రరేఖ. పోనీ, సరైన వాహనమైనా ఉందా అంటే లేదు. ముసలి ఎద్దునెక్కి ఊరేగుతాడు. ఆయనని సేవించే పరిజనం ఏమైనా పెద్దవాళ్లా అంటే ప్రమద గణాలు, భూతగణాలే. అయితేనేం, వారితోనే ఆయన జగత్ ప్రసిద్ధుడయ్యాడు.

### మహా విరాగి

ఎంత పేదవారయినా సరే, పెళ్లికి పట్టుబట్టలు కట్టుకుంటారు, వంటికి చందనాలు అద్దుకుంటారు. సుగంధ పరిమళాలతో కూడిన పూదండలను అలంకరించుకుంటారు. వేగంగా సంచరించే పక్షినో, జంతువునో వాహనంగా చేసుకుంటారు. పెళ్లికి అందరూ రాగలిగేందుకు అనువైన ముహూర్తాన్ని చూసి పగలు లేదా సాయంత్రం పెళ్లి పెట్టుకుంటారు. కానీ, పరమ విరాగి అయిన శివుడేమో పెళ్లికి కూడా గజచర్మమే కట్టుకు తిరుగుతాడు. ముసలి ఎద్దునెక్కి వూరేగుతాడు. ఏ వాసనా లేని తుమ్మిపూలు చాలంటాడు. బూడిద పూసుకు తిరుగుతాడు. ఒక విందూ లేదూ, వినోదమూ లేదు. తన భక్తులు తనకు నవకాయ పిండివంటలు వండి నివేదించనక్కరలేదు. కటిక ఉపవాసముంటే చాలంటాడు. తనకోసం ఒక పూట మేలుకుని ఉంటే మంచిదంటాడు.

### అర్ధనారీశ్వరత్వం

శివుడెలా ఉంటాడో, ఆయన భార్య పార్వతి అందుకు పూర్తి విరుద్ధంగా ఉంటుంది. ఆయన గజచర్మమే చుట్టుకున్నా, ఆవిడ మాత్రం పట్టుబట్టలు కట్టుకుంటుంది. ఒంటినిండా నగలు ధరిస్తుంది. శరీరానికి చందనం అద్దుకుంటుంది. సింహాన్ని వాహనంగా చేసుకుని నవరత్న ఖచిత సింహాసనంపై ఆసీనురాలవుతుంది. తనకు లేవు కదా అని ఆయన తన దేవేరి అయిన పార్వతిని పట్టుబట్టలు కట్టుకోవద్దనలేదు. ఆభరణాలు ధరించవద్దని కానీ, అలంకారాలు చేసుకోవద్దని కానీ శాసించలేదు. ఆమెను ఆమెగా ప్రేమించాడు. తన శరీరంలో సగభాగాన్ని ఆమెకు ఇచ్చేశాడు.

శివతత్త్వాన్ని అలవాటు చేసుకోవడమంటే నిరాడంబర జీవితాన్ని ఎంచుకోవడమేనని వేదాంతులు, పండితులు చెబుతారు. ఎందుకంటే అది అనుభవంలోకి వస్తే తప్ప అర్థం కాదు. శివుడంటే ఒక వ్యక్తా? అతనికి ఒక ఆకారం ఉన్నదా? ఎక్కడో ఫలానా ప్రదేశంలో కూర్చుని ఉన్నవాడా? కాదు. సమస్త విశ్వమూ శివుడే. దేనిలో నుంచి అంతా వచ్చిందో, దేనిలో అంతా జీవిస్తున్నదో, తిరిగి దేనిలోనికి అంతా లయమైపోతున్నదో అదే శివతత్త్వం. దీని నుంచి బయటకు వెళ్లడానికి వీలుకాదు. ఎందుకంటే సృష్టి అంతా శివుడే. ఆయన విశ్వరూపుడు. అదే సమయంలో ఆయన రూపం లేనివాడు, నిరాకారుడు. ఒకవైపు రుద్రమూర్తి. మరోవైపు బోళాశంకరుడు. సుందరేశుడు ఆయన. సౌందర్యానికి అధిపతీ ఆయనే.అదే సమయంలో భయంకరమైన అఘోర రూపం కూడా ఆయనదే. ఆనంద తాండవంలో చైతన్య శీలతనూ, ధ్యానంలోని స్థిరత్వాన్నీ, చీకటినీ, వెలుగు నూ, అమా యకత్వాన్నీ, తార్కికబుద్ధినీ, దయాగుణాన్నీ.. అన్నింటినీ కలగలిపి ఒక్కటిగా పంచేదే శివతత్త్వం. ఇది ఒక లీల. విశ్వచైతన్యపు ప్రదర్శన. ఎలాగైతే నాట్యమూ, నాట్యకారుడూ విడివిడిగా ఉండ లేరో.. అలాగే సృష్టి, సృష్టికర్త వేర్వేరు విషయాలు కావు. ఈ సత్యమే నటరాజ స్వరూపంలో కనిపిస్తుంది. ఈ రూపంలో పంచభూతాలు గోచరిస్తాయి. నటరాజు స్వయంగా చైతన్య స్వరూపం. ఆయన ఆనం ద నర్తనమే ఈ విశ్వం. ఆ సత్యమే శివతత్త్వం. ఆ ఆనందాన్ని అనుభవించగలిగే పర్వదినమే మహా శివరాత్రి. భక్తులు ఉపవాస జాగరణలు చేసేది ఆ అలౌకిక ఆనందాన్ని ఆస్వాదిం చేందుకే!

### మృత్యుంజయం

అత్యంత పవిత్రమైన మంత్రాలలో శివుని మృత్యుంజయ మంత్రం ఒకటి. మృత్యుంజయ అంటే చావుపై గెలుపు. ఆత్మకు చావు లేదు. అది ఒక శరీరం నుంచి మరొక శరీరానికి ప్రయాణిస్తుంది. మృత్యుంజయత్వం అంటే ఈ అశాశ్వతమైన జీవనంపై గెలిచి, మనసు శాశ్వతత్వానికి చేరుకోవడం. నేను శాశ్వతం, ఎన్నటికీ మార్పు చెందనిదేదో అది నాలో ఉన్నదని మనసు గ్రహిస్తుంది. అప్పుడు భయం ఉండదు. భయం అనేది మృత్యువుకు గల సంకేతాలలో ఒకటి. భయాన్ని జయించినపుడు ఈ అశాశ్వతమైన విషయాలను గుర్తుంచుకోవడం మానేసి, ఎన్నటికీ నాశనం కాని దానికోసం కదులుతాం. మనం ఈ రెండింటి కలయికగా ఉన్నాం. ఆత్మ... నాశనం లేనిది. శరీరం నశించిపోయేది. చాలాసార్లు మన మనసు శరీరానికి అంటిపెట్టుకుని తాను చనిపోతున్నానని భావిస్తూ ఉంటుంది. మనసును ఈ పరిమితమైన గుర్తింపు నుంచి అపరిమితమైన విశ్వవ్యాప్తమైన గుర్తింపు దిశగా మృత్యుంజయ మంత్రం తీసుకెళ్తుంది. ఈ మంత్రంలో ఒక ప్రార్థన ఉంది. ఆకాశమే కేశాలుగా గల అమిత బలవంతుడైన శివుడు మనల్ని బలవంతునిగా చేయుగాక. ఏ బంధాలూ లేని ఆ పరమ శివుడు మనల్ని అన్ని బంధాల నుంచి విముక్తుణ్ని చేయుగాక అని అంతరార్థం.

### మారేడుతో ఎందుకు పూజిస్తారు?

మహాశివుడికి మారేడు దళాలంటే మహా ఇష్టం. అందుకే మారేడును 'శివేష్ట' అని అంటారు. మారేడు ను బిల్వం అని కూడా అంటారు. బిల్వం అంటే శ్రీఫలం. అంటే లక్ష్మీదేవికి ఇష్టమైన ఫలాలను ఇచ్చేదనీ, సిరిని తెచ్చే ఫలం కలది అని అర్థం. మారేడు మంగళకరమైనది. మారేడు పత్రాలు త్రిశిఖలా ఉంటాయి. మూడు ఆకులతో ఉన్నందున త్రిశూలానికి సంకేతంగా భావిస్తారు. బిల్వపత్రాలతో పూజించడం వెనుక శాస్త్రీయత దాగి ఉంది. గాలిని, నీటిని శుభ్రపరచడంలో మారేడు ఆకులను మించినవి లేవు. ఈ చెట్టు గాలి శరీరానికి సోకినా, ఈ గాలిని పీల్చినా జబ్బులు రావు. బాహ్య, అంతర కణాలను శుద్ధి చేసి, శరీరాన్ని శ్రేష్ఠంగా ఉంచుతుంది. దేవాలయం గర్భగుడిలో గాలి సోకదు, సూర్యకిరణాలు ప్రసరించవు కనుక స్వచ్ఛత కోల్పోయే అవకాశం వుంది. అలాంటి వాతావరణంలో మారేడు ఆకులు స్వచ్ఛతను కలుగచేస్తాయి. అది మారేడు విశిష్టత. సూర్యుడిలో ఉండే తేజస్సు మారేడులో ఉంటుంది. శరీరం లోపలి భాగాల్లో, బయట వాతావరణంలో ఎక్కడ చెడు ప్రభావం ఉన్నా, దాన్ని హరిత్తింది. మారేడు వల్ల తన భక్తులకు ఇన్ని ప్రయోజనాలున్నాయి కనుకనే మారేడంటే శివుడికి మహా ఇష్టం కాబోలు.

## తెమడ రంగును బట్టి జబ్బును ఊహించవచ్చు!



మనకు కొన్నిసార్లు దగ్గు వచ్చి తెమడ / కళ్లె / గల్ల పడుతుంటుందన్న విషయం తెలిసిందే. ఇలా తెమడ / కళ్లె / గల్ల పడటాన్ని తడి దగ్గు అంటుంటారు. ఇలా పడే తెమడ (కళ్లె) రంగును బట్టి రకరకాల వ్యాధులను కొంతవరకు అనుమానించి, వాటికి తగిన విధంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించవచ్చు.

ఉదాహరణకు తెమడ రంగు...

ఆకుపచ్చగా ఉంటే... దాన్ని సూడోమోనాడ్ అనే కుటుంబానికి చెందిన సూడోమొనాస్ అనే ఒక రకం బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ వల్ల దగ్గు వస్తుండవచ్చు.

పసుపుపచ్చగా ఉంటే... క్లెబ్‌సిల్లా నిమోనియా తరహా ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు వచ్చే దగ్గుతో పాటు ఈ రంగులో తెమడ (కళ్లె) పడవచ్చు.

ఎర్రగా ఉంటే... సూడోమొనాలీ, నీమోకోకల్ వంటి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు ఎర్రరంగులో కళ్లెపడవచ్చు. కొన్ని సందర్భాల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చినప్పుడు కూడా ఎర్రరంగు కళ్లె పడవచ్చు. అయితే ఇలా ఎర్రరంగు పడ్డప్పుడల్లా అది క్యాన్సర్‌కు సూచన అని ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఇలా కనిపించేవాళ్లలోనూ క్యాన్సర్ ఉండేవారి శాతం చాలా తక్కువ.

నల్లగా ఉంటే... కాలుష్యం బారిన పడటం, పొగతాగడం వంటివి జరిగి ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ వస్తే అప్పుడు దగ్గుతో పాటు వచ్చే కళ్లె నల్లగా ఉండవచ్చు.

## భరత్‌పూర్ బర్డ్ శాంక్చురీ విహారం.. ఖండాంతరాలు దాటి..

**భరత్‌పూర్ బర్డ్ శాంక్చురీ... మన పక్షి ప్రేమికుడు సలీం అలీ మానసపుత్రిక. పక్షులు... ఖండాలు దాటి వస్తాయి. పర్యాటకులు... దేశాలు దాటి వస్తారు. పిల్లలు... ఏకంగా బడినే తెచ్చేస్తారు.**

భరత్‌పూర్ బర్డ్ శాంక్చురీ రాజస్థాన్‌లో ఉంది. ఈ ప్రదేశం దేశరాజధాని ఢిల్లీకి ఆ రాష్ట్ర రాజధాని జైపూర్‌కు సమదూరంలో ఉంది. ఆగ్రాలో తాజ్‌మహల్ చూసిన తర్వాత పశ్చిమంగా యాభై కిలోమీటర్లు ప్రయాణిస్తే భరత్‌పూర్‌లో ఉంటాం. ఏటా ఇక్కడికి సైబీరియా పక్షులు వస్తాయి. ఇక్కడ ఉన్నవి, అతిథులుగా వచ్చినవి కలిపి మొత్తం 370 పక్షిజాతులను చూడవచ్చు. అందుకే ప్రపంచంలోని ఆర్నిథాలజిస్టులు భరత్‌పూర్‌కి క్యూ కడతారు. ఏడాదికి లక్ష మంది పర్యాటకులకు తగ్గరు, వారిలో యాభై వేల మంది విదేశీయులే. స్కూలు పిల్లలైతే ఆ పరిసరాల జిల్లాలే కాదు ఢిల్లీ నుంచి కూడా ఎక్స్‌కర్షన్‌కి భరత్‌పూర్‌కి వస్తారు. పిల్లలకు వంద పేజీల పుస్తకంతో కూడా చెప్పలేనన్ని సంగతులను ఒక్క టూర్‌తో చెప్పవచ్చు. అందుకే బడి అప్పుడప్పుడూ అడవిలోకి వచ్చేస్తుంటుంది.

### ఏనుగు అంబారీ!

భరత్‌పూర్ బర్డ్ శాంక్చురీలో ఎలిఫెంట్ సఫారీ, జీప్ సఫారీతోపాటు రిక్షా సఫారీ కూడా ఉంటుంది. పక్షులు శబ్దాలకు బెదిరి ఎగిరిపోకుండా ఉండాలంటే ఏనుగు మీద కానీ రిక్షాలో కానీ వెళ్లాలి. రిక్షావాలానే గైడ్‌గా వ్యవహరిస్తాడు. దట్టమైన అటవీప్రదేశంలోకి వెళ్లడానికి మాత్రం జీప్ సఫారీనే మంచి ఆప్షన్. ఇక్కడ సఫారీ పగలు మాత్రమే. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటలకు ముగుస్తుంది. బర్డ్ శాంక్చురీ ప్రవేశ ద్వారం దగ్గరే జీప్ బుక్ చేసుకోవాలి. మితిమీరిన శబ్దాలను, హారన్‌లను అనుమతించరు. సొంత వాహనంలో వెళ్లినా సరే శాంక్చురీకి రెండు కిలోమీటర్ల దూరంలో ఆ వాహనాన్ని వదిలి టూరిజం శాఖ వాహనాల్లోనే లోపలికి వెళ్లాలి. ఇక్కడ ఫొటోగ్రఫీ, వీడియో షూటింగ్‌ను అనుమతిస్తారు. కానీ ఎంట్రీ టికెట్‌తోపాటు కెమెరాలకు చార్జ్ చెల్లించాలి.

### వేటాడే అడవి కాదిప్పుడు

ఇది ఒకప్పుడు భరత్‌పూర్ రాజుల వేటమైదానం. బ్రిటిష్ వైశ్రాయ్‌లు కూడా ఏటా ఇక్కడ డక్‌షూట్ నిర్వహించేవారు.

ఒక ఏడాది వైశ్రా య్ లార్డ్ లినిత్‌గొ వేటలో వేలాది పక్షులు వేట ఆనందానికి బలయ్యాయి.

ప్రసిద్ధ పక్షి ప్రేమికుడు సలీం అలీ కృషితో నలభై ఏళ్ల కిందట ఈ ప్రదేశం పక్షి సంరక్షణ కేంద్రంగా మారింది.

1985లో ఇది వర ల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు పొందింది.

అడవిలో నేల రాళ్ల మయం. నున్నటి కాలిబాట వంటి రోడ్డు కూడా ఉండదు. రాళ్లబాటలోనే నడవాలి. కాబట్టి ఈ టూర్‌లో మంచి షూస్ ధరించాలి.

ఆగ్రా, ఫతేపూర్ సిక్రీ, జైపూర్ టూర్ ప్లాన్‌లో భరత్‌పూర్ కూడా ఇమిడిపోతుంది.


ఇదే మంచికాలం!

ఖండాంతరాల నుంచి వచ్చే వలస పక్షులను చూడాలంటే అక్టోబర్ నుంచి ఫిబ్రవరి మధ్యలో వెళ్లాలి. ఆహ్లాదకరంగా వెకేషన్ కోసమే అయితే ఆగస్టు నుంచి నవంబర్ వరకు ఎప్పుడైనా వెళ్లవచ్చు. గడ్డకట్టే చల్లని వాతావరణం నుంచి సమశీతోష్ణమైన వాతావరణాన్ని వెతుక్కుంటూ వచ్చే ఈ పక్షులకు ఆరు నెలల పాటు మంచి విడిది భరత్‌పూర్ బర్డ్ శాంక్చురీ. ఏదైనా కారణం చేత ఒక ఏడాది నీటి నిల్వలు లేకపోయినట్లయితే ఈ పక్షులు నీళున్న వేరే ప్రాంతాలను వెతుక్కుంటూ వెళ్లిపోతాయి. ఒకసారి ఈ చక్రం గాడి తప్పితే మళ్లీ పక్షులు ఈ ప్రదేశానికి రావడానికి చాలా ఏళ్లు పడుతుంది. ఈ బర్డ్ శాంక్చురీ అసలు పేరు కేలాదేవ్ నేషనల్ పార్క్. ఈ పక్షి సంరక్షణ కేంద్రం భరత్‌పూర్‌కి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. అందుకే



భరత్‌పూర్ శాంక్చురీగా వాడుకలోకి వచ్చింది. ఆకాశంలో ఉండే ఇంద్రధనస్సు నేలకు దిగి పక్షుల రెక్కల్లో ఒదిగిపోయినట్లు ఉంటుంది. రంగురంగుల పక్షులు నీటిలో మునిగి చేపలు పట్టుకుని కడుపు నిండిన తర్వాత ఒడ్డుకు చేరతాయి. తడిసిన రెక్కలను విప్పార్చి సన్‌బాత్ చేస్తున్న దృశ్యం ఈ టూర్‌లో కనువిందు చేసే మరో ప్రత్యేకత.







# ఆర్సీబీ మేనేజ్మెంట్‌పై ఒత్తిడి చేయండి

## రాయుడు సంచలన కామెంట్స్



టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు మరోసారి వివాదస్పద వ్యాఖ్యలు చేశాడు. గత కొన్ని రోజులుగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గురించి ఘాటు విమర్శలు చేస్తున్న రాయడు తాజాగా సంచలన ట్వీట్‌తో వివాదాన్ని ముదిరేలా చేశాడు. ఆటగాళ్ల పేర్లను ప్రస్తావించకుండా పరోక్షంగా దారుణంగా విమర్శించాడు. అసలేం జరిగిదంటే.. ప్లేఆఫ్స్‌కు వెళ్లాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో సీఎస్కేపై ఆర్సీబీ ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో చెన్నై ఇంటికి, బెంగళూరు ముందుకు వెళ్లింది. అయితే మ్యాచ్ అనంతరం ఆర్సీబీ ఆటగాళ్లు, అభిమానులు సంబరాలు చేసుకున్న తీరుపై రాయుడు వ్యంగ్యంగా మాట్లాడాడు. అప్పుడే ఆర్సీబీ టైటిల్ సాధించినట్లుగా ఫీల్ అవుతుందని అన్నాడు. అయితే ఆ తర్వాత రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో బెంగళూరు ఓటమిపాలైంది. దీంతో రాయుడు ఆర్సీబీని మరోసారి విమర్శించాడు. సంబరాలు, దూకుడుగా ఉంటే కప్ ఇవ్వరని, సీఎస్కేపై గెలిస్తే ట్రోఫీ సాధించనట్లు కాదని రాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. తొలి ఎనిమిది మ్యాచ్‌ల్లో కేవలం ఒకే విజయంతో టోర్నీ నుంచి నిష్క్రమణ దాదాపు ఖరారైన స్థితి నుంచి ఆర్సీబీ గొప్పగా పోరాడి వరుసగా ఆరు విజయాలు సాధించింది. బలమైన సీఎస్కే జట్టుపై గెలిచి తదుపరి దశకు చేరింది. టైటిల్ మిస్ అయినప్పటికీ, ఆర్సీబీ అసాధారణ ప్రదర్శనను కొనియాడుతూ వెస్టిండీస్ క్రికెటర్ నికోలస్ పూరన్ పోస్ట్ చేశాడు. కానీ సీఎస్కే ప్లేయర్లు తుషార్ దేశ్‌పాండే, దీపక్ చాహర్, మాజీ ఆటగాడు అంబటి రాయుడు ఆర్సీబీని ట్రోల్ చేయడం గమనార్హం. ఫ్యాన్ వార్‌లా తమ స్థాయికి మించి ప్రవర్తించారని ఈ ఆటగాళ్లపై నెట్టింట్లో విమర్శలు వచ్చాయి. అయితే రాయుడు దానికి వివరణ ఇస్తున్నట్లుగా చేసిన తాజా ట్వీట్ వివాదం సద్దుమణిగేలా కాకుండా రెట్టింపు చేసేలా ఉంది."ఎన్నో ఏళ్లుగా ఆర్సీబీని సపోర్ట్ చేస్తున్న అభిమానుల పట్ల నాకెంతో ప్రేమ ఉంది. కానీ టీమ్ మేనేజ్మెంట్, లీడర్స్.. వ్యక్తిగత మైలు రాళ్ల కోసం కాకుండా జట్టు గురించి ఆలోచిస్తే ఇప్పటికీ ఆర్సీబీ ఎన్నో టైటిళ్లు సాధించేది. ఎంతో మంది అద్భుతమైన ఆటగాళ్లు జట్టును వీడారో ఓ సారి గుర్తు చేసుకోండి. జట్టు కోసం ఆడే ఆటగాళ్లను తీసుకు రమ్మని మేనేజ్మెంట్‌పై ఒత్తిడి చేయండి. మెగా వేలం నుంచి కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది" అని అంబటి రాయుడు ట్వీట్ చేశాడు.

# డీకే నీకు ఎప్పటికీ రుణపడి ఉంటా



టీమిండియా వెటరన్ వికెట్ కీపర్ దినేశ్ కార్తిక్ ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2024 సీజన్ ఎలిమినేటర్ మ్యాచ్ అనంతరం డీకే రిటైర్‌మెంట్ ప్రకటించాడు. ఈ సందర్భంగా బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. కార్తిక్‌ను ఓదార్చిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తాజాగా డీకేతో తనకున్న అనుబంధంపై కోహ్లీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాను తొలిసారి డీకేను కలిసిన సందర్భంగా ఇంకా గుర్తుందన్నాడు. సమస్యను ఎలా అధిగమించాలనేదానిపై అవగాహన కల్పించాడని, ఆ అమూల్యమైన సలహాకు ఎప్పటికీ రుణపడి ఉంటా అని విరాట్ పేర్కొన్నాడు. విరాట్ కోహ్లీ మాట్లాడుతూ%ో% 'నేను తొలిసారి దినేష్ కార్తిక్‌ను కలిసిన సందర్భంగా ఇంకా గుర్తుంది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఇద్దరం ఆడాం. 2009 ఛాంపియన్స్ ట్రోఫీ అది. డీకేతో కలిసి మొదటిసారి డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకున్నా. 'కార్తీక్ చాలా సరదాగా ఉంటాడు. అయితే హైపర్ యాక్టివ్. కన్‌ఫ్యూజ్డ్ పర్సన్ కూడా. ఎప్పుడూ తిరుగుతూనే ఉంటాడు' డీకేపై నాకు కలిగిన తొలి ఇంప్రెషన్ ఇదే. డీకే అద్భుతమైన ప్రతిభావంతుడు. అప్పటికీ ఇప్పటికీ అతడిలో ఏ మార్పులేదు. మైదానం వెలుపల అతడి సంభాషణలు ఆసక్తికరంగా ఉంటాయి. చాలా విషయాలపై మంచి నాలెడ్జ్ ఉంటుంది. క్రికెటేతర అంశాల గురించీ చెబుతాడు' అని తెలిపాడు. 'ఐపీఎల్ 2022 సీజన్ నాకు గొప్పగా ఏమీ లేదు. ఆత్మవిశ్వాసం విషయంలో చాలా ఇబ్బంది పడ్డా. అప్పుడు డీకే నా పక్కనే కూర్చొని నా సమస్యను వివరించాడు. దాన్ని ఎలా అధిగమించాలనేదానిపై సూచన ఇచ్చాడు. థ్యాంక్యూ డీకే.. నీ సలహాలతో మెరుగ్గా రాణించగలుగుతున్నా. నీకు ఎప్పటికీ అతడికి రుణపడి ఉంటా' అని విరాట్ కోహ్లీ చెప్పుకొచ్చాడు. ఈ సీజన్‌లో డీకే 15 మ్యాచుల్లో 326 పరుగులు చేశాడు. ప్రపంచకప్ 2024లో చోటు దక్కించుకోవడంలో కుర్రాళ్లకు పోటీదారుగా నిలిచిన డీకే.. వయసురీత్యా అవకాశం అందుకోలేకపోయాడు. 38 ఏళ్ల డీకే ఇప్పటివరకు భారత్ తరపున 26 టెస్టులు, 94 వన్డేలు, 60 టీ20లు ఆడాడు.

# కోచ్ పదవి కోసం బీసీసీఐ ఎవరినీ సంప్రదించలేదు

## టీమిండియా కొత్త కోచ్‌పై స్పందించిన జై షా

టీమిండియా హెడ్ కోచ్ పదవి కోసం బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవీకాలం జూన్ చివరితో ముగియనుంది. టీ20 ప్రపంచకప్ 2024 అనంతరం కొత్త కోచ్ బాధ్యతలు చేపడతాడు. అయితే బీసీసీఐ ఆఫర్ ఇస్తున్నా కోచ్ పదవిని చేపట్టడానికి విదేశీ మాజీ క్రికెటర్లు ఆసక్తి చూపించట్లేదని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కోచ్‌గా బాధ్యతలు అందుకున్న తర్వాత కుటుంబంతో ఎక్కువ సమయాన్ని గడపలేమని రికీ పాంటింగ్ పేర్కొన్నాడు. భారత కోచ్‌గా తీవ్ర స్థాయిలో ఒత్తిడి, రాజకీయాలను ఎదుర్కోవాల్సి వస్తుందని జస్టిన్ లాంగర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీలకు బీసీసీఐ ప్రధాన కార్యదర్శి జై షా కౌంటర్ ఇచ్చారు. టీమిండియా హెడ్ కోచ్ పదవి కోసం బీసీసీఐ ఎవరినీ సంప్రదించలేదని జై షా స్పష్టం చేశారు. 'నేను కానీ, బీసీసీఐ ఆఫీస్ బేరర్లు ఎవరూ కానీ ఏ ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్‌ను సంప్రదించలేదు. మీడియాలో వస్తున్న వార్తలన్నీ అవాస్తవం. హెడ్ కోచ్‌గా సరైన వ్యక్తినే ఎంపిక చేస్తాం. అదంతా ఓ ప్రణాళిక ప్రకారంగా జరుగుతుంది. భారత క్రికెట్ స్వరూపాన్ని సరిగ్గా అర్థం చేసుకున్న వారి కోసం చూస్తున్నాం. అద్భుత నైపుణ్యంతో జట్టును ఉన్నత శిఖరాలకు చేర్చే వారినే ఎంపిక చేస్తాం. దేశవాళీ క్రికెట్ గురించి పూర్తిగా తెలిసిన వారిని తీసుకొనేందుకు మొగ్గు చూపిస్తాం' అని జై షా స్పష్టం చేశారు.టీమిండియా హెడ్ కోచ్ పదవి కోసం మే 27 దరఖాస్తుల స్వీకరణకు చివరి గడువు. ఇప్పటి వరకు ఎవరు అప్లై చేశారనేది ఇంకా తెలియరాలేదు. చెన్నై సూపర్ కింగ్స్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వైపే బీసీసీఐ ఎక్కువ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఏడాదిలో పది నెలల పాటు భారత జట్టుతో ఉండటమే అతడికి ఇబ్బందిగా ఉందని సమాచారం. ఈ విషయంలో ఫ్లెమింగ్‌ను ఒప్పించే బాధ్యతను ఎంఎస్ ధోనీపై బీసీసీఐ పెట్టినట్లు వార్తలు వచ్చాయి. టీమిండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ పేరు కూడా రేసులో ఉందట. తాను దరఖాస్తు చేయడం లేదని రికీ పాంటింగ్ ఇప్పటికే వెల్లడించాడు. జస్టిన్ లాంగర్ ఈ భారాన్ని మోయలేనని చేతులెత్తేశాడు. జై షా వ్యాఖ్యలను బట్టి భారత నుంచే కోచ్ ఉంటాడని స్పష్టమవుతోంది.

# పాక్ జర్నలిస్ట్ నోరు మూయించిన రైనా!



టీమిండియా మాజీ క్రికెటర్, వరల్డ్ కప్ విన్నర్ సురేశ్ రైనాను ఓ పాకిస్థాన్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ ఎక్స్ వేదికగా ట్రోల్ చేశాడు. దీనికి రైనా తనదైన శైలిలో బదులిచ్చాడు. అదిరిపోయే సమాధానంతో సదరు పాక్ జర్నలిస్ట్ నోరు మూయించాడు. ప్రస్తుతం ఈ ట్వీట్స్ సోషల్ మీడియా వేదికగా వైరల్‌గా మారాయి. సురేశ్ రైనా సమయస్ఫూర్తికి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు.ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన అనంతరం సురేశ్ రైనా కామెంటేటర్‌గా తన రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. హిందీ వ్యాఖ్యానంతో అభిమానులను అలరిస్తున్నాడు. తనదైన ఛలోక్తులతో పాటు సీఎస్‌కే మాజీ ఆటగాడిగా.. ధోనీ సన్నిహితుడిగా తన జ్ఞాపకాలను పంచుకుంటున్నాడు. కామెంట్రీలో ఆరితేరిన సురేశ్ రైనాను ఓ మ్యాచ్ సందర్భంగా ఆకాశ్ చోప్రా రిటైర్మెంట్‌పై పునరాచోలన చేస్తావా? అని ప్రశ్నించాడు. దానికి రైనా.. యూటర్న్ తీసుకునేందుకు తాను ఏమైనా షాహిద్ అఫ్రిదినా? అని ప్రశ్నించాడు. షాహిద్ అఫ్రిది తన కెరీర్‌లో చాలా సార్లు రిటైర్మెంట్‌పై యూటర్న్ తీసుకున్నాడు. ఈ క్రమంలోనే అఫ్రిది పేరు చెప్పి రైనా నవ్వులు పూయించాడు. ఇక రైనా కామెంట్స్‌ను మనసులో పెట్టుకున్న పాకిస్థాన్ స్పోర్ట్స్ కంటెంట్ రైటర్ ఇమ్రాన్ సిద్ధిఖ్ అదును కోసం ఎదురు చూసి.. రైనాను ట్రోల్ చేశాడు. ఇటీవల షాహిది అఫ్రిదిని ఐసీసీ.. టీ20 ప్రపంచకప్‌కు ప్రచారకర్తగా ఎంపిక చేసింది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ సురేశ్ రైనాను ఇమ్రాన్ ఎగతాళి చేసే ప్రయత్నం చేశాడు. 'షాహిద్ అఫ్రిదిని ఐసీసీ.. టీ20 ప్రపంచకప్ అంబాసిడర్‌గా ప్రకటించింది. హాలో సురేశ్ రైనా ఇప్పుడు ఏం అంటావ్?'అని ట్వీట్ చేశాడు. ఇందుకు సురేశ్ రైనా దిమ్మదిరిగే సమాధానం ఇచ్చాడు. 'నేనేం ఐసీసీ ప్రచారకర్తను కాదు. కానీ 2011 ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడిని. మోహాలీలో మేం ఆడిన మ్యాచ్ గుర్తుందా? నాకు తెలిసి ఆ మ్యాచ్ నీకు మరిచిపోలేని జ్ఞాపకాలను గుర్తు చేస్తుందనుకుంటా?' అని నోరు మూయించాడు. 2011 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో షాహిద్ అఫ్రిది సారథ్యంలోని పాకిస్థాన్‌ను భారత్ 29 పరుగుల తేడాతో ఓడించి ఫైనల్ చేరింది. ఈ మ్యాచ్‌లో సురేశ్ రైనా 36 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టీ20 ప్రపంచకప్ 2024కు ఐసీసీ షాహిద్ అఫ్రిది, యువరాజ్ సింగ్, క్రిస్ గేల్‌తో పాటు ఉసెన్ బోల్ట్‌లను ఐసీసీ ప్రచారకర్తలుగా ప్రకటించింది.

---

## జీవిత కాలం పెన్షన్ కోసం

# ఎల్ఐసీ 'సరళ్ పెన్షన్'.. ఇవీ డిటైల్స్..!

ఇప్పుడు రోజురోజుకు పెరిగిపోతున్న ఖర్చులు.. కుటుంబ అవసరాలు ప్రతి ఒక్కరినీ ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రత్యేకించి రిటైర్మెంట్ దగ్గర్లో ఉన్న వారి పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటుంది. ఒకేసారి రిటైర్మెంట్ బెనిఫిట్స్ వచ్చినా.. తర్వాత ప్రతి నెలా కుటుంబ ఖర్చులు ఎలా అన్న విషయమై మదన పడుతున్నారు. ఇటువంటి వారిని ఇన్వెస్ట్‌మెంట్ వైపు ప్రోత్సహించి నెలవారీగా ఆదాయం అందించే పలు పథకాలు పాపులర్ అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ బీమా సంస్థ.. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ).. కొత్త పెన్షన్ స్కీం 'సరళ్ పెన్షన్' తీసుకొచ్చింది. పాలసీదారుడు ఒకేసారి ఎక్కువ మొత్తం ప్రీమియం చెల్లింపుతో పెన్షన్ పొందొచ్చు. ఈ పాలసీలో రెండు ఆప్షన్లు ఉన్నాయి.ఎల్ఐసీ సరళ్ పెన్షన్ కింద పాలసీదారుడు జీవితాంతం పెన్షన్ పొందడం ఒక ఆప్షన్ అయితే, పాలసీదారు మరణించిన తర్వాత 100 శాతం రిటర్న్స్‌తో ఉమ్మడి జీవిత వార్షికాదాయం పొందే ఆప్షన్. తొలి ఆప్షన్ ప్రకారం పాలసీదారు జీవించి ఉన్నంత వరకూ యాన్యుటీ చెల్లింపులు వాయిదాల వారీగా చెల్లిస్తారు. వ్యక్తి మరణిస్తే యాన్యుటీ చెల్లింపులు నిలిచిపోయి.. నామినీకి 100 శాతం మొత్తం చెల్లిస్తుంది ఎల్ఐసీ. రెండో ఆప్షన్ ప్రకారం పాలసీదారు, ఆ వ్యక్తి జీవిత భాగస్వామి జీవించి ఉన్నంత కాలం యాన్యుటీ బ్యాలెన్స్ చెల్లిస్తారు. జాయింట్ లైఫ్ యాన్యుటీ మాత్రం జీవిత భాగస్వామితో మాత్రమే తీసుకోవాలి.ఇక ఎల్ఐసీ సరళ్ పెన్షన్ పాలసీ కొనుగోలుకు40 ఏండ్లు కనీస వయస్సు, 80 ఏండ్లు గరిష్ట వయస్సుగా నిర్ణయించింది. ఈ బీమా పథకం కింద చెల్లించే యాన్యుటీని నెలవారీ, త్రైమాసికం, వార్షిక ప్రాతిపదికన చెల్లించేలా ఆప్షన్ ఎంచుకోవచ్చు. పాలసీ ప్రారంభ సమయంలోనే ఎల్ఐసీ తన పాలసీ డాక్యుమెంట్‌తోపాటు యాన్యుటీ రేట్ల హామీ ఇస్తుంది. తదనుగుణంగా పాలసీదారుకు జీవిత కాలం అంతా యాన్యుటీ వాయిదాలు చెల్లిస్తుంది. ఉదాహరణకు 60 ఏండ్ల వయస్సు గల వ్యక్తి రూ.10 లక్షల పెట్టుబడితో వార్షిక యాన్యుటీ ఆప్షన్ ఎంచుకుంటే ఏటా రూ.58,950 యాన్యుటీ వస్తుంది. ఈ స్కీం పూర్తి వివరాలను ఎల్ఐసీ అధికారిక వెబ్ సైట్ ద్వారా గానీ, స్థానిక ఎల్ఐసీ ఆఫీస్ ద్వారా గానీ పొందొచ్చు.

# ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ సిబ్బంది సమ్మె విరమణ.. ఏం జరిగిందంటే..?!



టాటా సన్స్ ఆధీనంలోని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ (ఏఐఎక్స్) సిబ్బంది సమ్మె విరమించారు. అనారోగ్య కారణాల పేరిట దాదాపు 300 మంది ఉద్యోగులు రెండు రోజులుగా మూకుమ్మడి సెలవులు పెట్టడాన్ని ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ యాజమాన్యం తీవ్రంగా పరిగణించింది. ఈ విషయమై 25 మంది సిబ్బందిని తొలగిస్తామన్న ఏఐఎక్స్.. మరి కొంత మందికి ఉద్వాసన తప్పదని హెచ్చరికలు జారీ చేయడంతో ఉద్యోగులు తమ ఆందోళన విరమించుకున్నట్లు సమాచారం. దీంతో సిబ్బంది తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటామని, వారిపై నమోదైన కేసులు సమీక్షిస్తామని ఏఐఎక్స్ అంగీకరించినట్లుగా తెలియవచ్చింది. యాజమాన్యం తీరుపై అసంతృప్తితో ఉన్న సిబ్బంది సుమారు 300 మంది మూకుమ్మడి సెలవులు పెట్టడంతో ఎయిర్ ఇండియా

## న్యూ వర్షన్ ఐక్యూబ్ ఎలక్ట్రిక్ స్కూటర్లతోపాటు

# ఈ-త్రీ వీలర్ ఆవిష్కరణకు టీవీఎస్ రెడీ..!



చెన్నై కేంద్రంగా పని చేస్తున్న ఆటోమొబైల్ కంపెనీ 'టీవీఎస్ మోటార్ కంపెనీ' నూతన శ్రేణి టూ వీలర్స్, త్రీ వీలర్స్ ఆవిష్కరించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ప్రత్యేకించి ఎలక్ట్రిక్ స్కూటర్ ఐక్యూబ్ న్యూ వర్షన్లను ఆవిష్కరించనున్నది. ప్రస్తుతం మార్కెట్లో 'ఐక్యూబ్', 'ఐక్యూబ్ ఎస్', 'ఐక్యూబ్ ఎస్టీ' మార్కెట్లో లభిస్తున్నాయి.కొత్తగా ఆవిష్కరించే ఐక్యూబ్ న్యూ వర్షన్ స్కూటర్లలో వేర్వేరు బ్యాటరీ కెపాసిటీ, వేర్వేరు ధరల ఆప్షన్లలో ఉంటాయి. వాటి ఆవిష్కరణకు టీవీఎస్ మోటార్ కంపెనీ ఎటువంటి టైంలైన్ ప్రకటించలేదు. కొత్తగా ప్రదర్శించిన ఎలక్ట్రిక్ త్రీ వీలర్ (ఈ3డబ్ల్యూ).. డెవలప్ మెంట్ అడ్వాన్స్ దశలో ఉందని తెలిపింది. ఈ ఏడాది భారత్ మార్కెట్ తోపాటు పలు దేశాల్లో ఆవిష్కరిస్తామని టీవీఎస్ మోటార్ కంపెనీ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.1100-1200 కోట్లు పెట్టుబడులు పెట్టాలని ప్రణాళికలు రూపొందించింది. కొత్త ఉత్పత్తుల కోసం సుమారు రూ.1000 కోట్ల నిధులు కేటాయించింది. గతేడాది టీవీఎస్ మోటార్ 'ఎక్స్' ఎలక్ట్రిక్ స్కూటర్ ఆవిష్కరించింది. త్వరలో వాటి డెలివరీ ప్రారంభం కానున్నది.

# మెప్పించని బీపీసీఎల్.. తగ్గిన మార్చి నికర లాభం.. ఎందుకంటే..?!

కేంద్ర ప్రభుత్వ రంగ చమురు సంస్థ బీపీసీఎల్ గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికం నికర లాభాలు 35 శాతం తగ్గిపోయాయి. 2022-23 మార్చి త్రైమాసికంలో రూ.6,478 కోట్ల నికర లాభం గడిస్తే, గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నికర లాభం రూ.4,224 కోట్లకు పరిమితమైంది. మార్కెట్ వర్గాలు బీపీసీఎల్ రూ.5,325 కోట్ల నికర లాభం గడిస్తుందని అంచనా వేశాయి. అయితే 1:1 నిష్పత్తి కింద ప్రతి వాటాదారుడికి బోనస్ ఇవ్వాలని బీపీసీఎల్ నిర్ణయించింది. అంటే ఇప్పటికే ఇన్వెస్టర్లుగా కొనసాగుతున్న వారికి అదనంగా మరో షేర్ కేటాయిస్తారు. బీపీసీఎల్ కంపెనీ ఆదాయం స్వల్పంగా తగ్గి రూ.1.33 లక్షల కోట్ల నుంచి రూ.1.32 లక్షల కోట్లకు పడిపోయింది. ప్రతిపాదిత బోనస్ చెల్లింపునకు జూన్ 22 రికార్డు తేదీగా నిర్ణయించింది.2023-24 ఆర్థిక సంవత్సరంలో బీపీసీఎల్ నికర లాభం రూ.26,673 కోట్లు. 2022-23లో రూ.1,870 కోట్లతో పోలిస్తే పలు రెట్లు ఎక్కువ. కానీ ఆదాయం మాత్రం రూ.5.33 లక్షల కోట్ల నుంచి రూ.5.06 లక్షలకు పడిపోయింది. ఫలితంగా ఎన్ఎస్ఈలో బీపీసీఎల్ షేర్ 4.5 శాతం పతనంతో రూ.592.25 వద్ద స్థిర పడింది.



# చిరు విశ్వంభరలోకి ఆషికా రంగనాథ్



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం విశ్వంభర సోషియో ఫాంటసీ నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రానికి బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీలో త్రిష ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నందూరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా మరో భామ విశ్వంభర టీంతో జాయిన్ అయింది. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్. మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర టీంతో ఆషికా రంగనాథ్ ప్రయాణం మొదలుపెట్టబోతుంది. బ్లాక్ బస్టర్ ఎక్స్‌పీరియన్స్ కోసం సిద్దంగా ఉండండి.. అంటూ ఆషికా రంగనాథ్‌కు స్వాగతం పలుకుతూ షేర్ చేసిన లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఏడాది నా సామి రంగ చిత్రంలో నాగార్జునకు జోడీగా మెరిసింది ఆషికా రంగనాథ్. మరి ఈ భామ విశ్వంభరలో ఎలాంటి పాత్రలో కనిపించబోతుందనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. తాజా అప్‌డేట్‌తో మెగాస్టార్ జెట్ స్పీడులో సినిమా పూర్తి చేసేలా ఉన్నాడని ఫుల్ ఖుషీ అవుతున్నారు చిరంజీవి అభిమానులు, మూవీ లవర్స్. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తుండగా.. ఆర్ఆర్ఆర్ ఫేం లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ.. సినిమాపై క్యూరియాసిటీతోపాటు అంచనాలు అమాంతం పెంచేస్తుంది. ఈ మూవీని 2025 జనవరి 10న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్.

# కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ఇండియాకు అవార్డు




77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ఇండియాకు అవార్డు దక్కింది. మైసూరుకు చెందిన ఫిల్మ్‌మేకర్ చిదానంద ఎస్ నాయక్‌ను అవార్డు వరించింది. సన్‌ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ వన్స్ టు నో అనే ఫిల్మ్‌కు లా సినెఫ్ అవార్డు దక్కింది. పూణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ ఇండియాలో టెలివిజన్ వింగ్‌లో ఆయన ఏడాది కోర్సు చేశారు. దానిలో భాగంగా తీసిన సన్‌ఫ్లవర్స్ చిత్రానికి ఆ అవార్డు దక్కింది. కన్నడ జానపదులకు చెందిన ఓ మహిళ జీవితకథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. లా సినెఫ్ మూడవ బహుమతి కూడా భారతీయులకే దక్కింది. బన్నీవుడ్ అనే యానిమేషన్ చిత్రం తీసిన భారతీయ సంతతి మహిళ మాన్సీ మహేశ్వరిని అవార్డు వరించింది. మీరట్‌లో మహేశ్వరి జన్మించారు. ఎన్ఐఎఫ్‌టీ ఢిల్లీలో ఆమె విద్యాభ్యాసం చేశారు. యూకేలోని నేషనల్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ స్కూల్లో కూడా ఆమె చదివారు. లా సినెఫ్ అవార్డుల్లో రెండో ప్రైజ్‌ను కొలంబియా యూనివర్సిటీ డైరెక్టర్ ఆస్యా సెగలోవిచ్‌కు దక్కింది. ఫస్ట్ ప్రైజ్ గెలిచిన వారికి 15000 యూరోలు గ్రాంట్ ఇస్తారు. రెండో ప్రైజ్ విన్నర్‌కు 11,250 యూరోలు, మూడవ ప్రైజ్ విన్నర్‌కు 7500 యూరోలు దక్కుతాయి. అవార్డు దక్కిన సినిమాలను జూన్ 3వ తేదీన సినిమా దు పాంథియన్ థియేటర్‌లో స్క్రీన్ చేస్తారు. గడిచిన అయిదేళ్లలో లా సినెఫ్ అవార్డుల్లో ఇండియాకు ఫస్ట్ ప్రైజ్ దక్కడం ఇది రెండో సారి. 2020లో ఎఫ్‌టీఐఐకి చెందిన అస్మితా గుహ నియోగికి అవార్డు దక్కింది. ఆమె క్యాట్ డాగ్ అనే చిత్రాన్ని తీశారు.

# కామంతో కాటు వేసే ‘యక్షిణి’.. ఇంట్రెస్టింగ్‌గా ట్రైలర్




బాహుబలితో ఆల్‌టైం బ్లాక్ బస్టర్ అందుకున్న ఆర్కా మీడియా వర్క్స్ ఇటీవలే కొత్త వెబ్ సిరీస్‌ను ప్రకటించిందని తెలిసిందే. యక్షిణి అంటూ వెబ్ సిరీస్ రానుండగా.. ఫాంటసీ, కామెడీ, రొమాన్స్ అంశాలతో వస్తున్న ఈ వెబ్ సిరీస్‌కు తేజ మార్ని దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అయిన డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో జూన్ 14 నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి వేదిక, మంచులక్ష్మి పోస్టర్లు విడుదల చేయగా.. ఆకట్టుకున్నాయి. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. యక్షిణి అనే కామపిశాచి కథల గురించి మనం వినే ఉంటాం.. రాత్రి ఒంటరిగా వెళ్లే మగాళ్లని తన అందచందాలతో లోబరచుకొని తన కోరిక తీరిన అనంతరం చంపేస్తుంది. అయితే ఇదే కాన్సెప్ట్‌తో ఇప్పటివరకు పుస్తకాలు రాగా.. తాజాగా వెబ్ సిరీస్ తెరకెక్కుతుంది. ఇక ఈ మూవీ ట్రైలర్ గమనిస్తే.. మాయ(వేదిక) అనే దేవకన్య మానవుడుతో శారీరక సంబంధం పెట్టుకున్న కారణంగా.. శాపానికి గురి అవుతుంది. ఇక ఈ శాప విమోచనం జరిగి మాయ దేవలోకం వెళ్లాలంటే 100 మంది మగవాళ్ళను తన అందచందాలతో లోబరచుకొని శృంగారంలో ఉన్నప్పుడే చంపాలి. ఈ క్రమంలోనే మాయ ఏం చేసింది అనేది తెలియాలంటే సిరీస్ వచ్చేవరకు ఆగాల్సిందే. ఇక ఈ సిరీస్ జూన్ 14 నుంచి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. వేదిక, మంచులక్ష్మి, రాహుల్ విజయ్, అజయ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ సిరీస్‌ని భారీ నిర్మాణ విలువలతో ఆర్కా మీడియా వర్క్స్ పతాకంపై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించారు.

# చాందిని చౌదరి ‘యేవమ్’ టీజర్ రిలీజ్



యువ నటులు చాందిని చౌదరి, వశిష్ట సింహా, జైభారత్, ఆషురెడ్డి ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం ‘యేవమ్’. నటుడు నవదీప్ తన సొంత నిర్మాణ సంస్థ సి-స్పేస్ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ప్రకాష్ దంతులూరి దర్శకత్వం వహిస్తున్నాడు. నవదీప్, పవన్ గోపరాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి చాందిని చౌదరి, ఆషురెడ్డిలతో పాటు భరత్‌రాజ్, కన్నడ రాయల్ స్టార్ యుగంధర్ ఫస్ట్ లుక్‌లను విడుదల చేయగా ఆకట్టుకున్నాయి. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి మేకర్స్ టీజర్ విడుదల చేశారు. తెలంగాణ బుర్రకథ స్టైల్‌లో ఈ టీజర్‌ను కట్ చేశారు

# రోహిత్ శెట్టి..సింగం అగెయిన్



రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ సినిమాలకు బాక్సాఫీస్ వద్ద సూపర్ క్రేజ్ ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇదే ఫ్రాంచైజీలో వస్తున్న తాజా చిత్రం సింగం అగెయిన్. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం కశ్మీర్‌లో కొనసాగుతోంది. ఇప్పటికే షూటింగ్ సందర్భంగా కశ్మీర్‌లో సహస్ర సీమా బల్ జవాన్లతో అజయ్ దేవ్‌గన్, రోహిత్ శెట్టి టీం దిగిన ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.తాజాగా సింగం మరోసారి ఆన్‌డ్యూటీలో అంటూ.. అజయ్ దేవ్‌గన్ షూటింగ్ లొకేషన్‌లో దిగిన స్టిల్ ఒకటి నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. బాజీరావు సింహం.. ఎస్ఎస్‌పీ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ జమ్మూ / కశ్మీర్ పోలీస్..జీతిని త్వరలో వస్తుందని రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ట్వీట్ చేసింది. సింగం అగెయిన్ మరో బ్లాక్ బస్టర్‌గా రికార్డులు క్రియేట్ చేయడం పక్కా అని అజయ్ దేవ్‌గన్ తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. సింగం ఫ్రాంఛైజీలో వస్తున్న మూడో పార్టు ఇది.ఈ మూవీలో రన్‌వీర్ సింగ్, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్, కరీనాకపూర్, దీపికాపదుకొనే, అజయ దేవ్‌గన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. దీపికాపదుకొనే పోలీసాఫీసర్ గెటప్‌లో యాక్షన్ మూడ్‌లోకి వెళ్లిన స్టిల్ ఒకటి ఇప్పటికే సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. రోహిత్ శెట్టి ఇండియన్ పోలీస్ ఫోర్స్ ప్రాజెక్ట్‌తో డిజిటల్ వరల్డ్‌లోకి కూడా అడుగుపెట్టాడు. సిద్దార్థ్ మల్హోత్రా, శిల్పాశెట్టి, వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటించిన ఈ సిరీస్ జనవరి 19న ప్రైమ్ వీడియోలో రిలీజైంది.

# కృతిసనన్ పదేళ్ల సినీ ప్రయాణం



బాలీవుడ్‌లో తన తొలి సినిమా విడుదలై పదేళ్లు పూర్తయిన సందర్భంగా నటి కృతి సనన్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. బాలీవుడ్ చిత్రంతో ’హీరో పంటీ’తో కృతీ హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత బీటౌన్‌లో వరుస సినిమాలు చేస్తున్నారు. తన పదేళ్ల కెరీర్‌ను గుర్తు చేసుకుంటూ పోస్ట్ పెట్టారు. హిందీ పరిశ్రమకు వచ్చి 10 ఏళ్లు గడిచాయంటే నమ్మలేకపోతున్నా. నిన్ననే మొదటిసారి సెట్‌లోకి అడుగుపెట్టానేమో అనిపిస్తుంది. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. మంచి స్నేహితులను, మరిచిపోలేని జ్ఞాపకాలు సొంతం చేసుకున్నా. నా ప్రయాణంలో భాగమై నన్ను ఆదరించిన అందరికీ, నన్ను నమ్మి ప్రోత్సహించిన దర్శకనిర్మాతలకు ఫ్యాన్స్ కు కృతజ్ఞతలు. పెద్ద కలలు కనాలి. వాటిని నిజం చేసుకునేందుకు కృషి చేయాలి. నేనూ అదే చేశాను. నా ప్రయాణంలో మరెన్నో అద్భుతాలు చూడాలనుకుంటున్నా అని రాశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన పాత్రల గురించి కృతి మాట్లాడుతూ సవాల్‌తో కూడిన పాత్రలంటే తనకు ఇష్టమని అన్నారు. రోజూ కొత్తగా ప్రయత్నించే అవకాశమున్న ఇండస్ట్రీలో ఉన్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలని.. ఇక్కడికి రావాలి, కలలు కనేవారికి స్ఫూర్తిగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కృతి ’దో పత్తీ’తో బిజీగా ఉన్నారు. ’బ్లూ బటర్ ఫ్లై ఫిలిమ్స్’ పతాకంపై ఆమె నిర్మించనున్న తొలి చిత్రమిది.

# 31న వస్తున్న గంగం గణేశా !




యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ’గం..గం..గణెళిశా’ . ఫన్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని హై-లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ శెట్టి ఈ సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్‌లు విడుదల చేయగా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రం మే 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా మూవీ సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డ్ సభ్యులు ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్‌ను అందించారు. ఓవైపు కామెడీతో పాటు రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రగతి శ్రీవాస్తవ, ఎన్ సారిక ఈ చిత్రంలో కథానాయికలుగా నటిస్తుండగా.. ఇమ్మాన్యుయేల్, వెన్నెల కిషోర్, రాజ్ అర్జున్, సత్యం రాజేష్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# ’96’ మూవీ దర్శకుడితో కార్తీ, అరవింద స్వామి మల్టీస్టారర్..



కోలీవుడ్ స్టార్ నటులు కార్తీ , అరవింద స్వామి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం మేయలగన్ (తెలుగులో నిజం ం అందమైన అని అర్థం). ఈ సినిమాకు ’96’ వంటి బ్లాక్ బస్టర్ సినిమాను అందించిన ప్రేమ్ కుమార్.సీ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇక ఈ పోస్టర్‌లో అరవింద స్వామి సైకిల్ నడుపుతుండగా.. కార్తీ సంతోషంతో మునిగి తెలుతున్నట్లు ఉన్నాడు. ఇక ఈ పోస్టర్ గమనిస్తే.. ఫ్రెండ్‌షిష్ నేపథ్యంలో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్య- జ్యోతిక నిర్మిస్తుండగా.. రాజ్ కిరణ్, శ్రీదేవి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 96 సినిమా సంగీత దర్శకుడు గోవింద్ వసంత ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు.

# రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్న శర్వానంద్ ‘మనమే’



టాలీవుడ్ మోస్ట్ ప్రామిసింగ్ యాక్టర్ శర్వానంద్ కథానాయకుడిగా చేస్తున్న తాజా చిత్రం మనమే. ఈ సినిమాకు శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహిస్తుండగా.. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ మూవీ నుంచి ఇప్పటికే టైటిల్ గ్లింప్స్‌తో పాటు టీజర్ రిలీజ్ చేయగా.. ప్రేక్షకు ల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చి ంది. తాజాగా మూవీ నుంచి చిత్రయూనిట్ విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను జూన్ 07న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఎక్స్ వేదికగా వెల్లడించిం ది.ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ఒక డిఫెరెంట్ లవ్ స్టోరీ ను చూపించబోతున్నట్లు శ్రీరామ్ ఆదిత్య తెలిపాడు.

Owner, Editor, Printed & Published : Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, RNI NO : TELTEL/2023/86487 Cell: 8125972476. website : quicktodaynews.com .com, e-mail : quicktodaynews@gmail.com